PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 7 | విజయవాడ, సోమవారం 7 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 7 August 2023 | Rs

పవర్ 'దంగల్'

- అధ్యక్ష బరిలో బ్రిజ్‌భూషణ్ అనుచరుడు సంజయ్ సింగ్
- రెజ్లింగ్ కుటుంబం మద్దతుతో అనిత షియోరాన్
- భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు

6

ఇంజనీరింగ్ ఫీజుల ఖరారు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2023-24 నుంచి 2025-26 విద్యా సంవత్సరాలకు ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో వివిధ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఫీజులను ఖరారు చేసింది. ఆదివారం ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామలరావు జివో నం.41ను విడుదల చేశారు. కనీస ఫీజుగా రూ.43 వేలను, గరిష్ట ఫీజుగా రూ.77 వేలుగా నిర్ణయించింది. 92 కళాశాలలకు కనీస ఫీజు నిర్ణయించగా, 16 కళాశాలలకు రూ.70 వేలు నుంచి రూ.77 వేల మధ్య నిర్ణయించింది. వీటితో పాటు ప్రయివేటు యూనివర్సిటీలకు కూడా ఫీజులను నిర్ధారిస్తూ మరో జివోను ప్రభుత్వం విడుదల చేసింది. క్రియా, విట్, ఎస్ఆర్ఎం, సెంచ్యురియన్, భారతీయ, మోహన్ బాబు, అపోలో యూనివర్సిటీల్లో బిటెక్, ఎంటెక్, డిగ్రీ కోర్సులకు ఫీజులను నిర్ణయించింది. విట్, ఎస్ఆర్ఎం, మోహన్ బాబు బ్రౌన్ ఫీల్డ్ యూనివర్సిటీలలకు రూ.70 వేలను నిర్ణయించింది. ఫీజులను నిర్ణయించడంతో సోమవారం నుంచి 12వ తేదీ వరకు ఇఎపిసెట్ వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ యధావిధిగా జరగనుంది. ఫీజులు నిర్ణయించకపోవడంతో కౌన్సిలింగ్ ప్రక్రియ ఆలస్యమైన సంగతి తెలిసిందే.

అధిక ధరలు, నిరుద్యోగంపై

దేశవ్యాప్త పోరు

సెప్టెంబర్ 1 నుంచి 7వరకు ఆందోళనలు

- బిజెపిని ఏకాకిని చేసి ఓడించేందుకు ఉమ్మడి కృషి
- రాష్ట్ర స్థాయిల్లోనే సీట్ల సర్దుబాటు
- ఎస్‌కెఎం, కార్మిక సంఘాల ఆందోళనకు మద్దతు
- మీడియాతో సీతారాం ఏచూరి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ధరల పెరుగుదల, అంతులేని నిరుద్యోగంపై సెప్టెంబరు 1 నుండి వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. మూడు రోజుల పాటు హరికిషన్ సింగ్ సుర్జీత్ (హెచ్‌కెఎస్) భవన్‌లో జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. అనంతరం కేంద్ర కమిటీ నిర్ణయాలను ఏచూరి మీడియాకు వెల్లడించారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని అసాధారణ ఆర్థిక అస్తవ్యస్థ స్థితిలోకి నెట్టిందని ఆయన అన్నారు. ప్రజల జీవనోపాధి తదితర సమస్యలపై వామపక్షాలతో చర్చించి, ఆందోళన కార్యక్రమం రూపొందిస్తామని తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ, సంయుక్త కిసాన్ మోర్చా ఉమ్మడిగా పిలుపు ఇచ్చిన ఆందోళనలకు కేంద్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని పేర్కొన్నారు. మహిళ, చిన్నారులపై అత్యాచార దాడులు పెరిగిపోతుండడం పట్ల కేంద్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని, మహిళ సంఘం నిర్వహించే ర్యాలీకి మద్దతు ప్రకటించిందని తెలిపారు.

బిజెపి వ్యతిరేక ఓటు చీలకుండా వ్యూహ రచన

ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై చర్చించాం. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఏకాకిని చేసి ఓడించడానికి అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహం గురించి చర్చించామని ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన సంప్రదింపులు జరుగుతున్నాయని. ముంబయిలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1న జరగబోయే ఇండియా వేదిక సమావేశంలో మరిన్ని పార్టీలు చేరే అవకాశం ఉందని తెలిపారు. కూటములు, పొత్తులు, సీట్ల పంపకాలు, అవగాహనలు ఏవైనా రాష్ట్ర స్థాయిల్లోనే ఉండాలని అన్ని పార్టీలు అంగీకరించాయని అన్నారు. రాష్ట్ర స్థాయిల్లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నందున తదనుగుణంగా బిజెపి వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకు వ్యూహ రచన చేస్తున్నామన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ మధ్య పోటీ ఉంది. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష కూటమి, కాంగ్రెస్, ఇతర లౌకిక పార్టీలు టిఎంసి, బిజెపిలతో తలపడనున్నాయి. బీహార్‌లో మహా కూటమి, మహారాష్ట్రలో మహా వికాస్ అగాఢీ, తమిళనాడులో లౌకిక కూటమి ఇలా ప్రతి రాష్ట్రంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్ర స్థాయిల్లో బిజెపి వ్యతిరేక ఓటును గరిష్టం చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి. బిజెపి వ్యతిరేక ఓటును సమన్వయం చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు చేసుకున్న ఒప్పందమే భారత్ కుటమి. లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిల్లో ఎటువంటి కూటమి లేదని ఆయన తెలిపారు.

గందరగోళం మధ్య కీలక బిల్లులు ఆమోదం సరికాదు : ఏచూరి 5



హిరోషిమా అమరులకు నివాళులర్పిస్తున్న ప్రజలు


అణ్వాయుధాలకు మద్దతు మూర్ఖత్వం

- హిరోషిమా మేయర్ కజుమి మట్సుయి

హిరోషిమా: ఒక వైపు ఉక్రెయిన్ యుద్ధం, మరో వైపు కొరియాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న ఈ తరుణంలో అణ్వాయుధాలకు మద్దతు పలకడం మూర్ఖత్వమే అవుతుందని హిరోషిమా నగర మేయర్ కజుమి మట్సుయి విమర్శించారు. రెండు మాసాల క్రితం హిరోషిమాలో జరిగిన జి-7 కూటమి సదస్సులో అణ్వాయుధాలను కలిగివుండడాన్ని సమర్థిస్తూ కొందరు నేతలు చేసిన ప్రసంగాలను దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జపాన్ పశ్చిమ నగరమైన హిరోషిమాపై మొదటి అణు బాంబు దాడి జరిగి 78 ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం నాడిక్కడి శాంతి స్మారక ఉద్యానవనంలో జరిగిన స్మారక కార్యక్రమంలో ఆయన శాంతి ప్రకటన చేస్తూ అణు యుద్ధాలను నిరోధించే సిద్ధాంతాలను వదిలేయడం ప్రమాదకరమన్నారు. ప్రమాదకర వర్తమానం నుండి ఆదర్శవంతమైన భవిష్యత్తు వైపు మనల్ని నడిపించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రపంచ నేతలను ఆయన కోరారు. జపాన్ తక్షణమే అణు నిరోధక ఒప్పందంపై సంతకం చేయాలని ఆయన కోరారు. ఆ తరువాత మాట్లాడిన జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా అణు నిరోధక ఒప్పందంపై సంతకం చేసేది లేనిది చెప్పకుండా మిగతా 5లో

5 దశల్లో 'అసైన్డ్' గుర్తింపు

గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితా ● అభ్యంతరాలకు ఏడు రోజులు గడువు ● మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్ భూములు కేటాయించబడిన వారికి యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ, నిషేధిత భూముల జాబితానుంచి తొలగించేందుకు వీలు కల్పిస్తూ గత నెల 31న ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిన సంగతి పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో తాజాగా ఆదివారం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చే నాటికి 20 సంవత్సరాలు ముందు పట్టాలు పొందిన వ్యవసాయ భూములు, పది సంవత్సరాలు దాటిన ఇంటిస్థలాలకు భూ యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ఆయా భూములను భవిష్యత్తులో అమ్ముకునే హక్కు, భూ బదలాయింపు చేసే హక్కు అసైన్డ్ పట్టాదారునికి సంక్రమించనుంది. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం వేగవంతం చేసింది. అసైన్డ్ భూములు, నివేశనస్థలాలు అసలైన లబ్ధిదారుల చేతుల్లోనే ఉన్నాయా? పట్టాలు పొందిన లబ్ధిదారులు నేటికీ ఆయా భూములపై పొజీషన్‌లో ఉన్నారా? లేక వారి వారసుల చేతుల్లో ఎంత మేర భూములు సాగులో ఉన్నాయనే అంశాలను సర్వే నెంబర్ వారీగా గుర్తించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎంత మేర భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయనే అంశాలను కూడా రెవెన్యూ అధికారులు గుర్తించనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం ఐదు దశల్లో స్క్రూట్నీ చేసి తుది జాబితాను తయారు చేయాలని భూపరిపాలన కమిషనరు సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఇందుకు సంబదించిన మిగతా 2లో

గద్దర్ ఇకలేరు



ఫోటో సౌజన్యం : కె నరహరి

- ప్రభుత్వ లాంఛనాలతో నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

విప్లవ కవి గద్దర్ (గుమ్మడి విఠల్‌రావు) (74) ఇకలేరు. గతకొంతకాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయనకు హైదరాబాద్ అమీర్‌పేటలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లో ఈ నెల 3న వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. అనంతరం పోస్ట్ సర్జరీ సమస్యలతోపాటు ఊపిరితిత్తులు, యురినరీ ఇన్‌ఫెక్షన్‌తో గద్దర్ ఆరోగ్యం మరింత క్షీణించి ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య విమల, ముగ్గురు పిల్లలు (సూర్యుడు, చంద్రుడు, వెన్నెల) ఉన్నారు. గద్దర్ 1949లో తూప్రాన్‌లో జన్మించారు. నిజామాబాద్, హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన 1975లో కెనరా బ్యాంకులో ఉద్యోగం చేశారు. జన నాట్యమండలి వ్యవస్థాపకుల్లో గద్దర్ ప్రముఖులు. ప్రజాసమస్యలపై పోరాడడమే కాకుండా తనదైన పాటలతో అందరినీ ఉత్తేజ పరిచేవారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఉద్యమానికి ఊపు తెచ్చారు. 1987లో కారంచేడు దళితుల హత్యలపై గద్దర్ పోరాడారు. నకిలీ ఎన్‌కౌంటర్లను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై హత్యాయత్నం జరిగింది. 'మా భూమి' చిత్రంలో నటించిన గద్దర్... పలు సినిమాలకు పాటలు రాశారు. 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమా...' పాటకు నంది అవార్డు ప్రకటించినా ఆయన తిరస్కరించారు. గద్దర్ మరణవార్త తెలియగానే ఆయన అభిమానులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి తరలివచ్చారు. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఎల్‌బి స్టేడియంకు తరలించారు. తెలంగాణ మంత్రులు జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు కవిత, గోరేటి వెంకన్న, కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క, తెలంగాణ పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, సాహితీ స్రవంతి ఎపి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, పలువురు ఎమ్మెల్యేలు... గద్దర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గద్దర్ అంత్యక్రియలు అల్వాల్ భూదేవి నగర్‌లోని మహాభారతి విద్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. గద్దర్ మృతి పట్ల తెలంగాణ సిఎం కెసిఆర్, గవర్నర్ తమిళి సై, పలువురు మిగతా 2లో

ప్రతికూలతను అధిగమిస్తూ ముందుకెళ్తున్నాం ! : ప్రధాని మోడీ

- రైల్వే స్టేషన్ల మెరుగుదలకు శంకుస్థాపన

3



విహారయాత్రలో విషాదం

- కాలువలో కారు బోల్తా
- ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం

3



తాగునీటి నిధులు దారిమళ్లించారు

- మౌలిక వసతులపై కొరవడిన శ్రద్ధ
- పాదయాత్రలో నారా లోకేష్


పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 176వ రోజుకు చేరింది. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలోని జయంతిరామపురం గ్రామం నుంచి ఆదివారం పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రజలు తాగు, సాగునీటి ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రైతులంతా భూగర్భజలాలపైనే ఆధారపడుతున్నారని, కొన్నేళ్ళుగా భూగర్భజలాలు కూడా తగ్గిపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతం కావడంతో తాగునీటికి కూడా ఇబ్బంది పడుతున్నామన్నారు. చుక్కల భూములను క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ప్రజల దాహార్తి తీర్చేందుకు కేంద్రం జల్ జీవన్ మిషన్ కింద ఇచ్చిన నిధులను కూడా జగన్ దారిమళ్లించారని విమర్శించారు.

ప్రజలకు గుక్కెడు నీళ్లందించలేని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి దోపిడీపై ఉన్న శ్రద్ధ రైతాంగ సమస్యల పరిష్కారంపై లేదని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో చిన్ననీటి వనరుల అభివద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. సంక్షేమ పథకాలు అందిస్తున్నామనే సాకుతో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం విస్మరిస్తోందని అన్నారు. రహదారులు,. తాగునీటి, సాగునీటి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడంలేదని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

నదుల అనుసంధానంతోనే అభివృద్ధి

- ఇరిగేషన్‌పై జగన్‌కు అవగాహన లేదు : చంద్రబాబు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి, ఒంగోలు కలెక్టరేట్, మద్దిపాడు

దేశంలో నదుల అనుసంధానం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, కావేరి, కృష్ణా, గోదావరి, పెన్నా నదులను అనుసంధానించాల్సిన అవసరముందని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఇరిగేషన్‌పై అవగాహన లేదని విమర్శించారు. ప్రాజెక్టుల విధ్వంసంపై చేపట్టిన యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఆదివారం ఆయన పర్యటించారు.

నెల్లూరులో ఇరిగేషన్, స్వచ్ఛంద సామాజిక నాయకులతో మాట్లాడారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మల్లవరంలోని కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. గతేడాది వరదలకు కొట్టుకుపోయిన ఈ ప్రాజెక్ట్ గేటును పరిశీలించారు. రైతు ప్రతినిధులు, ఆయకట్టు రైతులతో ఆయన ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంతోపాటు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నదుల అనుసంధానానికి ఎంతో ప్రాధాన్యత ఉందని


ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మల్లవరం కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్ట్ వద్ద బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

తెలిపారు. నెల్లూరు జిల్లాలో టిడిపి ప్రభుత్వ హయంలోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. 2014 తర్వాత నదీ జలాల సక్రమ, సమగ్ర వినియోగంపై ఒక విధానం సిద్ధం చేశామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రానికీలేని సాగునీటి వనరుల లభ్యత మన రాష్ట్రానికి ఉందన్నారు. దీనిని వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని, రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలుగుతాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన ఐదు నదుల అనుసంధానంతో నీటి కరవు అనేది ఉండదన్నారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాలోని తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు చేపట్టింది ఎన్‌టిఆర్ అని గుర్తు చేశారు. సోమశిల కెపాసిటీ పెంచి ప్రారంభించిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. పోలవరం పూర్తి చేయడానికి టైం పడుతుందని పట్టిసీమ లిఫ్ట్ కట్టామని, దీనివల్ల కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వగలిగామని తెలిపారు. పట్టిసీమ వల్ల గోదావరి నీరు కృష్టా డెల్టాకు ఇచ్చి, డెల్టాకు రావాల్సిన నీటిని పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమకు నీరు ఇచ్చామన్నారు. నదుల అనుసంధానం వల్ల రెండు ప్రాంతాలకు లబ్ధి జరిగిందని తెలిపారు. గోదావరి నీటిని బనకచర్లకు తీసుకొస్తే రాయలసీమకు నీరు అందించవచ్చన్నారు.

బనకచర్లకు గోదావరి నీరు వస్తే ఐదు జిల్లాలకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో విధ్వంసం తప్ప అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదన్నారు. గోదావరి నదిలో నీళ్లు ఉన్నా కృష్ణా నదికి నీళ్లు ఇవ్వలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని విమర్శించారు. టిడిపి అధికారంలోకొస్తే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేటు కొట్టుకుపోతే కోటి రూపాయలతో గేటు పెట్టలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని విమర్శించారు.

వరద ప్రాంతాల్లో

- నేడు, రేపు ముఖ్యమంత్రి పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఇటీవల భారీ వర్షాలు, వరదలకు దెబ్బ తిన్న ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు అధికంగా వున్న అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో పలు గ్రామాల్లో బాధిత ప్రజలతో ఆయన మాట్లాడనున్నారు. సోమవారం అల్లూరి జిల్లా కూనవరం, విఆర్‌పురం మండలాలకు చెందిన వరద బాధితులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వెళ్లి బాధితులను పరామర్శిస్తారు.

అదే రోజు రాత్రికి రాజమండ్రి ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఉన్నతాధికారులతో సమీక్షిస్తారు. రెండో రోజైన మంగళవారం కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గురజాపులంకలో పర్యటిస్తారు. తానేలంక, రామాలయంపేటలో వరద బాధితులతో సమావేశమై సమస్యలు తెలుసుకోనున్నారు. ఆ తర్వాత అయినవిల్లి మండలం తోటరాముడివారిపేట, కొండుకుదురు గ్రామాలకు వెళ్లనున్నారు.

ముఖ్యమంత్రిగారూ... వై నాట్ ఒపిఎస్

- సెప్టెంబర్ 1న చలో విజయవాడ
- ఎపిసిపిఎస్‌ఇఎ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమల్జేయాలనే డిమాండ్‌తో ఉద్యోగులు పోరాటానికి సిద్ధమవతున్నారు. 'ముఖ్యమంత్రిగారూ వై నాట్ ఒపిఎస్' పేరుతో పోరాటానికి సమాయత్తం కావాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ (ఎపిసిపిఎస్‌ఇఎ) పిలుపునిచ్చింది. ఇదే నినాదంతో ఒపిఎస్ కోసం సెప్టంబర్ 1న చేపట్టనున్న 'చలో విజయవాడ' పోస్టర్‌ను ఆదివారం ఇక్కడ అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు రొంగల అప్పలరాజు, కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులు వున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమల్లోకి తీసుకొస్తామని హామీ



'చలో విజయవాడ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చిన జగన్ ..ఆ హామీని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ఇప్పటికీ అమల్జేయకుండా ఉద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగులను మభ్యపెట్టేందుకు జనరల్ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) అంటూ కొత్త రాగాలు తీస్తున్నారని వాపోయారు. జిపిఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెడతామంటూ ఉద్యోగ సంఘాల నాయకులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఒపిఎస్ తప్ప ఉద్యోగులకు మరో మార్గం లేదని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సెప్టెంబర్ 1న జరిగే శాంతియుత పోరాటానికి రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగులంతా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిసిపిఎస్‌ఇఎ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరి ఎం రవికుమార్, అసోషియేట్ అధ్యక్షులు ఎంసి రామనర్సింహా తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రయివేటీకరణపై 'యూనివర్సిటీ'

- వచ్చే నెలలో విడుదలకు సన్నాహాలు
- సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న నారాయణ మూర్తి

విద్యను ప్రయివేటీకరణ చేయడం వల్ల కలిగే దుష్ఫలితాల ఇతివృత్తంగా యూనివర్సిటీ సినిమాను తెరకెక్కించినట్లు సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. శ్రీకాకుళంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నేహ చిత్ర బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ విజయనగరం పరిసరాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణతో విద్యార్థులకు, యువతకు వాటిల్లుతున్న నష్టాన్ని కళ్లకు కట్టినట్లు చూపామన్నారు. ప్రయివేటీకరణ వల్ల సంస్థల మధ్య పోటీ పెరిగి పేపర్ లీకేజీ వంటి అక్రమాలకు పాల్పడుతున్నాయని చెప్పారు. దీనివల్ల యువత నష్టపోవడమే కాకుండా మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సినిమా ద్వారా ప్రయివేటీకరణ దుష్ఫలితాలపై ప్రజలను జాగృతం చేయడంతోపాటు విద్యార్థి, యువత మనోధైర్యం కోల్పోవద్దని సందేశం ఇస్తున్నామని తెలిపారు. ఈ సినిమాను ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. సెప్టెంబరులో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. భావి పౌరులు తరగతి గదుల్లో నుంచి రావాలన్న జవహర్‌లాల్ నెహ్రూ మాటలకు భిన్నంగా నేడు తరగతి గదులు జైళ్ల మాదిరిగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే యువత ఆలోచనా సరళి మారిందన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో పేదలకు విద్య దూరం కానున్న నేపథ్యంలో యూనివర్సిటీ చిత్రం యువతను ఆలోచింపజేస్తుందని తెలిపారు.

17 నుంచి సిపిఐ బస్సుయాత్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి సెప్టంబర్ 8 వరకు సిపిఐ రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర నిర్వహించనుంది. 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' నినాదంతో విశాఖలో ప్రారంభమయ్యే ఈ యాత్ర తిరుపతిలో ముగియనుంది. ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ బస్సు యాత్ర వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, కెవివి ప్రసాద్ కూడా పాల్గొన్నారు. దేశాన్ని బిజెపి దివాళాతీయిస్తే, రాష్ట్రాన్ని వైసిపి దివాళా తీయిస్తోందని రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు అప్పులు వున్నాయని ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నియంత్రించకపోగా మరింత అప్పుల ఊబిలోకి వెళ్లేలా ప్రోత్సహిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలపై నిర్బంధం రోజురోజుకు పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈ నెల 17న విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీ నుండి మొదలయ్యే బస్సు యాత్ర 26 జిల్లాల్లో పర్యటించి సెప్టంబర్ 8న తిరుపతిలో జరిగే బహిరంగసభతో ముగుస్తుందని తెలిపారు. ఈ బస్సు యాత్ర కార్యక్రమాల్లో సిపిఐ జాతీయకార్యదర్శి డి రాజా, పార్టీ కేంద్ర నాయకులు బినోయ్ విశ్వం, అమరజిత్ కౌర్, కె నారాయణ పాల్గొంటారని తెలిపారు.

ఉపాధ్యాయులను వేధించడం దుర్మార్గం

- టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యాప్‌ల అప్‌లోడ్ పేరుతో ఉపాధ్యాయులను వేధించడం దుర్మార్గమని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పాఠశాలల విలీనం, ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యారంగాన్ని భ్రష్టుపట్టించిన సిఎం జగన్ ఉపాధ్యాయులకూ సవాలక్ష పనులు అప్పగిస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పోటీపడి మరీ ఉపాధ్యాయులకు అవసరం లేని పనులు అప్పగించి అదనపు పనిభారం మోపడం పైశాచికత్వానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తమానం యాప్‌ల అప్‌లోడ్ పేరుతో టీచర్ల సమయమంతా వృథా చేస్తే టీచర్లు పాఠాలు ఎప్పుడు చెప్పాలని ప్రశ్నించారు. పాఠశాలల తనిఖీలకు వెళ్లిన ఉన్నతాధికారులు విద్యార్థులు ఎలా చదువుతున్నారో ఆరా తీయకుండా యాప్‌లు డౌన్‌లోడ్ చేశారా అని టీచర్లను ప్రశ్నించడం సిగ్గుచేటని విమర్శించారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించలేక మరోవైపు పనిభారంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విద్యాబోధన అంతా నిర్వీర్యం చేస్తున్న యాప్‌లను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

'పోరుజాత' సభను జయప్రదం చేయాలి

- శ్రామిక మహిళ సమన్వయ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న పోరుజాత ముగింపు సందర్భంగా ఈ నెల 8న విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని శ్రామిక మహిళ రాష్ట్ర సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు కమిటీ కన్వీనర్ కె ధనలక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలపై జరుగుతున్న హింస, పాశవిక దాడులు మద్యం, మాదక ద్రవ్యాలను అరికట్టాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, దాడులపై అధ్యయన కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ ఈ జులై 28 నుంచి పోరుజాత జరుగుతుందని పేర్కొన్నారు. శ్రామిక మహిళలు పనిచేసే ప్రాంతాలు, కుటుంబాలు, సమాజంలో హింసకు గురవుతున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఈ వేధింపులు మరింత ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. పని ప్రదేశంలో జరుగుతున్న హింసపై అధికారులకు ఫిర్యాదులు చేసిన సందర్భాల్లో బాధితుల వైపు కాకుండా బాధించే వారి వైపే ప్రభుత్వం మొగ్గుచూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, మున్సిపల్, బిల్డింగ్, షాప్ ఎంప్లాయిస్, హాస్టళ్లు, సేల్స్‌గర్ల్స్, పరిశ్రమల్లో పనిచేసే వారు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా జరిగే పోరుజాత బహిరంగ సభలో మహిళలు, అభ్యుదయ వాదులు, సమాజహితం కోరుకునే వారందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అమరావతి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు మంజూరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో పనిచేస్తున్న పారిశుధ్యకార్మికులకు చెల్లించాల్సిన మే, జూన్ నెల వేతనాలను తక్షణమే బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికారసంస్థ (సిఆర్‌డిఎ) కమిషనర్ వివేక్‌యాదవ్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికుల నిర్వహణ చూస్తున్న ఏజెన్సీ స్థానంలో కొత్తవారిని ఎంపిక చేయడంతో జీతాలు అలస్యమయ్యాయని పేర్కొన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను తక్షణమే జమ చేయాల్సిందిగా పాత ఏజెన్సీని ఆదేశించామని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్‌స్కేల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తాడేపల్లిలోని కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్రకార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సింగ్ సర్వీస్ (ఆప్కాస్) అనే ప్రభుత్వరంగ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సంఘం సిఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపి రెవెన్యూ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆఫరేటర్ల సంఘం అధ్యక్షులు జ్యోతుల సూరిబాబు, ఎపి రెవెన్యూ జెఎసి ఛైర్మన్ విఎస్ దివాకర్ పాల్గొన్నారు.

రావులపాలెంలో దారుణం

- సెల్ఫీ పేరుతో తల్లి, ఇద్దరు పిల్లలను నదిలో తోసేసిన కసాయి

ప్రజాశక్తి - రావులపాలెం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో గోదావరి వంతెనపై దారుణం జరిగింది. సహజీవనం చేస్తున్న మహిళతోపాటు, ఆమె ఇద్దరి పిల్లలను ఓ వ్యక్తి గోదావరి నదిలో తోసేశాడు. ఈ ఘటనలో తల్లి, ఏడాది చిన్నారి గల్లంతవ్వగా.. మరో బాలికను పోలీసులు రక్షించారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రావులపాలెం సిఐ ఎన్.రజనీకుమార్, ఎస్‌ఐ ఎం.వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సుహాసిని భర్తతో విడాకులు తీసుకుని కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ఉలవ సురేష్‌తో సహజీవనం చేస్తోంది. ఆమెకు జెర్సీ (9), లక్ష్మీ కీర్తన (11) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా వీరి మధ్య విభేదాలు తలెత్తడంతో తరచూ గొడవపడుతున్నారు. ఈ క్రమంలో ఎలాగైనా సుహాసినిని అంతం చేయాలని సురేష్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో పిల్లలతో రాజమహేంద్రవరం వెళ్దామని సుహాసినితో చెప్పాడు. శనివారం రాత్రి సుహాసిని, పిల్లలను కారులో రాజమహేంద్రవరం తీసుకొచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున రావులపాలెంలోని గౌతమి గోదావరి బ్రిడ్జి పైకి తీసుకొచ్చి సెల్ఫీ తీసుకుందామని వారిని కారు దించాడు. సెల్ఫీ తీస్తున్నట్లు నమ్మించి ముగ్గురిని గోదావరిలోకి తోసేశాడు. సుహాసిని, ఆమె చిన్న కుమార్తె గోదావరిలో కొట్టుకుపోయారు. లక్ష్మీకీర్తన బ్రిడ్జి రెయిలింగ్‌కు ఉన్న ప్లాస్టిక్ పైపును పట్టుకుంది. ఆమె వద్ద సెల్ ఫోన్ ఉండడంతో ఒక చేత్తో పైపును గట్టిగా పట్టుకుని, మరో చేత్తో డయల్ 100కు ఫోన్ చేసి రక్షించాలని కోరింది. పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాలికను రక్షించారు. ఆమెకు వైద్యసాయం అందించారు. అనంతరం బాలిక నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. నిందితుని కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సచివాలయ ఉద్యోగులుగా జెఎల్‌ఎం గ్రేడ్-2లను గుర్తించాలి

- ఎఐటియుసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జూనియర్ లైన్‌మ్యాన్ (జెఎల్‌ఎం) గ్రేడ్-2లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి అధ్యక్షులు, గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జి ఓబులేష్, అధ్యక్షులు కె మల్లిఖార్జున రెడ్డి డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర సదస్సు విజయవాడలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ సెక్రటరీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని పేర్కొన్నారు. ఎఐటియుసి అధ్యక్షులు రవీంద్రనాథ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంజునాథ్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. అసోసియేషన్ కోశాధికారి సుధీర్ బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు కృపాకర్, రహీమ్, అంబేద్కర్, రామకృష్ణ, నూరుల్ల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యుపిలో అమానుషం

సిద్ధార్థనగర్ : ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ జిల్లాలో ఇద్దరు బాలుర పట్ల అతిదారుణంగా, అమానుషంగా వ్యవహరించిన ఘటన తాజాగా వెలుగుచూసింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోళ్ల ఫారమ్‌లో రూ.2 వేలు దొంగిలించారని ఆరోపిస్తూ 10, 15 ఏళ్ల వయసున్న అఫ్జల్, విజయ్ సాహ్నిలను గత శుక్రవారం చేతులు కట్టేసి, పత్రబజార్‌లోని కొంకటి క్రాసింగ్ వద్ద ఉన్న చికెన్ షాపుకు తీసుకొచ్చారు. వారు మిరపకాయలు తినేలా చేసి, బాటిల్‌లో నింపిన మూత్రాన్ని తాగాలని బలవంతపెట్టారు. కొంతమంది వ్యక్తులు వారిని దుర్భాషలాడడం, కొడతామని బెదిరించడం ఆ వీడియోలో కనిపించింది. మరొక వీడియోలో అబ్బాయిల చేతులను వెనుకకు కట్టి, ప్యాంటు కిందికి లాగి నేలపై పడుకుని ఉండగా, ఒక వ్యక్తి వారి మలద్వారంలో పచ్చి మిరపకాయలను రుద్దడం కనిపించింది. నొప్పితో అరుస్తున్న అబ్బాయిలకు పెట్రోలు ఇంజెక్ట్ చేశారు. పిల్లలిద్దరూ సహాయం కోసి అరిచినా, వారిని రక్షించడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆగస్టు 4న ఈ వీడియో తీసినట్లు పోలీసులు నిర్ధారించారు. అఫ్జల్ తండ్రి మహ్మద్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిదిమందిపై కేసు నమోదు చేశామని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ సిద్ధార్థ తెలిపారు.

5 దశల్లో 'అసైన్డ్' గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న అసలైన అసైన్ట్ దారుడే క్షేత్రస్థాయిలో భూమిమీద ఉన్నాడా లేదా అనేది తొలుత గుర్తించనున్నారు. తొలి దశలో గ్రామ రెవెన్యూ అధికారి(విఆర్‌ఓ) భూ రికార్డుల స్వచ్ఛీకరణ (పిఓఎల్‌ఆర్) కింద రెవెన్యూ రికార్డుల్లో గుర్తించిన అసైన్డ్ భూముల్లో వ్యవసాయ భూములు, నివేశన స్థలాలకు కేటాయించిన వాటి వివరాలను పరిశీలించాలి. అనంతరం గతంలో రెవెన్యూశాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలతో సరిచూసుకోవాల్సి ఉంటుంది. వీటితో పాటు డికెటి రిజిస్టర్, 1బి అండంగల్, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ మరొక వైపు క్షేత్రస్థాయిలో భూమి స్వరూపాన్ని పరిశీలించాలి. సర్వే నెంబరు వారీగా ఆయా భూములకు సంబంధించిన వివరాలను విఆర్‌ఓ నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆయా భూముల యజమానులు అసలైన వారా? లేక వారి వారసులా? అనే అంశాన్ని గుర్తించాల్సి ఉంటుంది. లబ్ధిదారునికి భూమి ఏ సంవత్సరంలో కేటాయించారనే వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆయా సర్వే నెంబర్ల భూములను 22(ఎ) నిషేధిత భూముల జాబితానుంచి తొలగించవచ్చని సూచిస్తూ మండల తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. రెండో దశలో విఆర్‌ఓలు రికార్డులు సరిచూడటం, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన అనంతరం నివేదికను ఆయా మండల తహసీల్దారుకు అందజేయాల్సి ఉంటుంది. ఆయా రికార్డులను తహసీల్దార్లు క్షుణ్ణంగా పరిశీలించాలి.ఇందుకు సంబంధించి ఆయా భూముల్లో అసైన్డ్ లబ్దిదారులు లేకుండా ఆయా భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లి ఉంటే ఆ విషయాన్ని సిఎంఆర్‌ఓ సెక్షన్‌కు ఇ- ఫైల్ ద్వారా తెలియజేయాల్సి ఉంటుంది. సిఎంఆర్‌ఓ సెక్షన్ నుంచి అందే సూచనలను బట్టి ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. తహసీల్దార్ విచారణ పూర్తి చేసిన అనంతరం అసైన్డ్ ల్యాండ్స్ వివరాలు, భూ యజమానుల వివరాలను ఆయా గ్రామ,వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డులో ప్రజలందరికీ వాస్తవ లబ్ధిదారులు ఎవరనే తెలిసే విధంగా వివరాలు నోటీసు బోర్డులో పెడతారు. ఆయా భూములకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే తెలుపుకునేందుకు ప్రభుత్వం 7 రోజులు సమయం ఇచ్చింది. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది జాబితాను ఆర్‌డిఓ/ సబ్ కలెక్టర్‌కు తహసీల్దార్లు జాబితాను అందజేస్తారు. మూడో దశలో మండల తహసీల్దార్లు పంపిన జాబితాలో 5శాతం రికార్డులను ర్యాండమ్‌గా ఆర్‌డిఓ/సబ్ కలెక్టర్ పరిశీలించాల్సి ఉంటుంది. నాలుగో దశలో నివేదికను జాయింట్ కలెక్టర్‌కు పంపుతారు. మొత్తం నివేదికలో 1శాతం రికార్డులను జెసిలు ర్యాండమ్‌గా పరిశీలించాలి. రికార్డులన్ని పారదర్శకంగా ఉన్నాయని భావించిన అనంతరం ఆయా రికార్డులను సెక్షన్ 22(ఎ) ఆఫ్‌ది రిజిస్ట్రేషన్ యాక్ట్ -1908 కింద ఆయా జిల్లా కలెక్టర్లకు పంపాల్సి ఉంటుంది. ఈ దశలన్ని దాటుకుని వచ్చిన నివేదికలను జిల్లా కలెక్టర్ పరిశీలించిన అనంతరం అర్హుల జాబితాను ఆయా జిల్లా రిజిస్ట్రార్‌కు పంపడంతో పాటు జిల్లా స్థాయిలో గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు.


గద్దర్ భౌతికకాయం వద్ద అశ్రునయనాలతో బంధుమిత్రులు

గద్దర్ ఇకలేరు

మొదటి పేజీ తరువాయి

మంత్రులు, సినీ, ఇతర రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. తన జీవిత కాలం ప్రజల కోసమే బతికిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ తెలంగాణ గర్వించే బిడ్డ అని సిఎం కెసిఆర్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన చేసిన ప్రజాసేవకు గౌరవ సూచికంగా అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తామన్నారు. తన పాటలతో పేదల్లో చైతన్యాన్ని నింపి వారి హక్కుల సాధనకు ఉద్యమబాట పట్టిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని ఎపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

గద్దర్ మృతి పట్ల సిపిఎం సంతాపం ప్రకటించింది. సిపిఎం నిర్వహించిన అనేక ప్రజా ఉద్యమాలకు ఆయన మద్దతిచ్చారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, తమ్మినేని వీరభద్రం గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు. గద్దర్ తన పాటలు, కళారూపాల ద్వారా అట్టడుగు వర్గాలకు చెందిన గ్రామీణ ప్రాంత పేదలను భూస్వాములు, పెత్తందార్ల దోపిడీకి వ్యతిరేకంగా సమీకరించారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తన సంతాప సందేశంలో తెలిపారు. గద్దర్ మృతితో విప్లవ గళం మూగబోయిందని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి, సినీనటులు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాపాటల రచయితగా తనదైన శైలిలో రచించి గళమెత్తిన గద్దర్ లేనిలోటు పూడ్చలేనిదని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షులు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి సత్యరంజన్ పేర్కొన్నారు. సంతాపం తెలిపిన వారిలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్.అనిల్‌కుమార్, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఒ.నల్లప్ప, ఆంధ్ర మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

ప్రజలు ప్రశ్నించాలి

- ఆ విధంగా చైతన్యవంతులు కావాలి
- మహా పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి – కర్నూలు ప్రతినిధి/హాస్పిటల్

సమస్యలపై పాలకులను ప్రజలు ప్రశ్నించాలని, ఆ విధంగా చైతన్యవంతులు కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర ఐదోరోజుకు చేరింది. ఆదివారం గూడూరు మండలం కె.నాగలాపురంలో ప్రారంభమైన పాదయాత్ర పర్ల, సల్కాపురం మీదుగా పెద్దపాడు గ్రామం వరకు సాగింది. ఈ సందర్భంగా పర్లలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం కంకణం కట్టుకుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, రైతులు, యువత, ప్రజల కోసం ఈ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఎల్లెల్సీ కాలువకు నీళ్ల రాకుండా పోయే పరిస్థితి వచ్చిందని, ప్రత్యామ్నాయాల గురించి పాలకులకు పట్టడం లేదన్నారు. రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం లేదని, అందుకే కర్నూలు జిల్లా అభివృద్ధికి నోచడంలేదని తెలిపారు. జిల్లా అభివృద్ధికి నాయకులు ఏం చేస్తారో ప్రజలు ప్రశ్నించాలన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రకు ప్రజలు మద్దతు తెలపాలని, సోమవారం నిర్వహించే మహా ధర్నాలో పాల్గొనాలని కోరారు. సల్కాపురంలో పాదయాత్రకు టిడిపి నాయకులు దేవేంద్ర రెడ్డి మద్దతు తెలిపారు. పెద్దపాడులో సిపిఎం నాయకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు టి.నరసింహ పాల్గొన్నారు.

నేడు మహాధర్నా.. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు రాక

సిపిఎం చేపట్టిన మహా పాదయాత్రలో భాగంగా సోమవారం మహాధర్నా చేపట్టనున్నారు. ఉదయం తాజ్ ఫంక్షన్ హాల్ నుండి పాదయాత్ర ప్రారంభమమై కర్నూలు నగరం గుండా సాగుతూ కలెక్టరేట్ వరకు సాగనుంది. అక్కడ మహాధర్నా నిర్వహించనున్నారు. దీనికి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరు కానున్నారు.

ప్రతికూలతను అధిగమిస్తూ ముందుకెళ్తున్నాం !

- రైల్వే స్టేషన్ల మెరుగుదల పనులకు ప్రధాని శంకుస్థాపన
- ప్రతిపక్షాలపై విసుర్లు

న్యూఢిల్లీ / ప్రజాశక్తి – ఏలూరు అర్బన్ : 'అమృత్ భారత్ పథకం' పేరుతో దేశంలోని 508 రైల్వేస్టేషన్ల మెరుగుదల పనులకు ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. శంకుస్థాపన అనంతరం ఆయన మాట్లాడుతూ, తాము పనిచేయం, పనిచేసే వారిని అడ్డుకుంటామన్నట్లుగా ప్రతిపక్షాల్లో ఓ సెక్షన్ పనిచేస్తోందని రుసరుసలాడారు. అధునాతనంగా తీర్చిదిద్దిన పార్లమెంట్ భవనాన్ని కూడా కొన్ని పార్టీలు తప్పుపట్టాయన్నారు. ప్రతికూల రాజకీయాలను అధిగమిస్తూ అభివృద్ధి ప్రాధాన్య మార్గంలో ముందుకెళ్తున్నామని చెప్పారు. 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 508 స్టేషన్లను తిరిగి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈశాన్య భారతదేశంలోని అన్ని రాష్ట్ర రాజధానులు రైల్వే నెట్‌వర్క్‌తో త్వరలో అనుసంధానం కానున్నాయని తెలిపారు. స్థానిక సంస్కృతి, వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని కొత్త డిజైన్లను రూపొందించనున్నట్లు ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.24,470 కోట్లుగా వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో 39 రైల్వే స్టేషన్లను తొలి దశలో అభివృద్ధి చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.453.50 కోట్లతో 18 స్టేషన్లలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. రాష్ట్రంలో అభివృద్ధి చేసే స్టేషన్లలో పలాస, విజయనగరం, అనకాపల్లి, దువ్వాడ, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలు, తెనాలి, రేపల్లె, పిడుగురాళ్ల, కర్నూలు, కాకినాడ టౌన్, ఏలూరు, తుని, ఒంగోలు, సింగరాయకొండ, దొనకొండ ఉన్నాయి.


ఏలూరులో పాల్గొన్న గవర్నర్

ఏలూరు రైల్వే స్టేషన్‌లో రూ.21.1 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఏలూరు రైల్వేస్టేషన్‌కు రూ.21.1 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టబోయే ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసేందుకు గవర్నర్ ఏలూరుకు విచ్చేశారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఢిల్లీ నుండి ప్రధాని నరేంద్ర మోడీ వీడియో సందేశాన్ని ఆయన వీక్షించారు. అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఏలూరు రైల్వే స్టేషన్ ముఖ్య ప్రాంగణాలను అభివృద్ధి చేయడం, మెరుగైన పార్కింగ్, లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, సాంస్కృతిక చిహ్నాలు, స్థానిక కళాకారుల ఉత్పత్తులను ప్రోత్సహించడానికి 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి' పథకం కింద స్టాల్ ఏర్పాటుకు స్థలం కేటాయించడం, ఎత్తయిన ఫ్లాట్ ఫారాల ఏర్పాటు, సాంకేతికంగా అభివృద్ధి చేయబడిన ప్రజా సమాచార వ్యవస్థ, స్పష్టమైన ఎల్ఇడి బోర్డుల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు, డిఐజి జివిజి.అశోక్‌కుమార్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, జడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పండి

- అయిప్సో, ఇస్కఫ్ డిమాండ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

హింసాత్మక సంఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొల్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో), సాంస్కృతిక స్నేహ సహకార సంఘం (ఇస్కఫ్) డిమాండ్ చేశాయి. హిరోషిమా డే సందర్భంగా ఆదివారం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో 'అణ్వాయుధాలు కాదు, అన్నవస్త్రాలు కావాలి, శాంతి వర్ధిల్లాలి, మతోన్మాదం నశించాలి' నినదిస్తూ ఈ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అయిప్సో రాష్ట్ర కన్వీనర్ ఎం సుబ్బారావు మాట్లాడుతూ ఉక్రెయిన్ యుద్ధానికి అమెరికా ఆజ్యం పోస్తుందన్నారు. ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు మాట్లాడుతూ హిరోషిమా, నాగసాకిలపై నాడు అమెరికా జరిపిన అణుబాంబు దాడుల్లో లక్ష మంది పైగా ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ ఈ ప్రాంతాల్లో పౌష్టికాహార లోపంతో అనేక మంది బాధపడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు, ఏపి ప్రజానాట్య మండలి కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

హింసను రెచ్చగొడుతున్న పాలకులను గద్దెదించాలి

మహిళా పోరుయాత్రలో ఐద్వా నాయకుల పిలుపు

ప్రజాశక్తి- యంత్రాంగం



ఉయ్యూరులో పోరుయాత్రకు స్వాగతం పలుకుతున్న మహిళలు

హింసను రెచ్చగొడుతున్న పాలకులను గద్దెదించాలని ఐద్వా నాయకులు పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యాన చేపట్టిన మహిళా పోరుయాత్ర ఆదివారం నాటికి పదో రోజుకు చేసుకుంది. విశాఖలో ప్రారంభమైన యాత్ర కృష్ణా జిల్లాలో రెండో రోజూ కొనసాగింది. మచిలీపట్నం నుంచి ప్రారంభమై ఉయ్యూరు, యనమలకుదురు వరకూ సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల జరిగిన సభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, ఉపాధ్యక్షులు పి.పూర్ణ మాట్లాడారు. చిన్నారులు, మహిళలపై హింస రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హింసను రెచ్చగొడుతున్న మతోన్మాద బిజెపి పాలకులను గద్దె దించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయన్నారు. మహిళపై హింసను ప్రభుత్వాలు అరికట్టే వరకూ పోరు కొనసాగించాలని కోరారు. యాత్రకు ఎక్కడికక్కడే ఘనస్వాగతం లభించింది. ఐద్వా జిల్లా కార్యదర్శి వి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన పోరుయాత్ర ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కొనసాగింది. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మద్యాన్ని ఆదాయ వనరుగా ప్రభుత్వాలు భావించడం విచారకరమన్నారు. ఒక్కప్పుడు పెద్ద పెద్ద పట్టణాలకు మాత్రమే పరిమితమైన మత్తుపదార్థాలు నేడు గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయని తెలిపారు. వీటి ప్రభావంతో యువత జీవితాలు అధోగతి పాలవుతున్నాయన్నారు. సమానత్వ సాధనకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని మహిళలను కోరారు. యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 8న విజయవాడలో సభలో ఐద్వా జాతీయ నాయకులు బృందా కరత్ ప్రధానవక్తగా పాల్గొంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మహిళలు భారీగా తరలిరావాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, అధ్యక్షులు షర్మిల పాల్గొన్నారు. అనంతరం యాత్ర కొండపి, సంతనూతలపాడు మండలంలోకి, తర్వాత బాపట్ల జిల్లా వేటపాలెం మండలం దేశాయిపేటలోకి ప్రవేశించింది. అక్కడ యాత్రకు ప్రజాసంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు.

మోడీని గద్దె దింపాలి

- దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడుకోవాలి
- కార్మిక సంఘాల నేతల పిలుపు



మానవహారంలో పాల్గొన్న ఉమామహేశ్వరరావు, వి. నాగేశ్వరరావు, సాంబశివరావు, లక్ష్మణ, రవిచంద్ర తదితరులు

ప్రజాశక్తి – వన్‌టౌన్ (ఎన్‌టిఆర్ జిల్లా)

దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడుకోటానికి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ వన్‌టౌన్‌లని వస్త్రలత వద్ద అదివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎం.సాంబశివరావు, ఎఐఎఫ్‌టియు నాయకులు లక్ష్మణ్, ఐఎఫ్‌టియు నాయకులు ఎ.రవిచంద్ర, రామకృష్ణ మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్ల మోడీ పాలనలో దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కార్పొరేట్లకు మేలు చేసే విధానాలు తెచ్చి ప్రజలపై భారాలు మోపిందన్నారు. ఇలాంటి ప్రభుత్వం కొనసాగడం దేశానికి, ప్రజలకు క్షేమం కాదన్నారు. అందుకోసమే ఈ నెల 9న వివిధ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీతోపాటు భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యాపిల్ రైతులకు కేరళ మద్దతు

- ముఖ్యమంత్రి విజయన్ హామీ


యాపిల్ రైతుల సమస్యలను కేరళ సిఎం విజయన్ దృష్టికి తీసుకొస్తున్న ఎఎఫ్ఎఫ్ఐ ప్రతినిధులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

యాపిల్ రైతులకు సహకార సంస్థల ద్వారా కేరళ మార్కెట్‌లో మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ హామీ ఇచ్చారు. ఆదివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ (హెచ్‌కెఎస్) భవన్‌లో విజయన్‌ను యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఎఫ్ఎఫ్ఐ) ప్రతినిధి బృందం కలిసింది. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మొహమ్మద్ యూసుఫ్ తరిగామి, రాకేష్ సిన్హా, ఎఎఫ్ఎఫ్ఐ కన్వీనర్ సోహన్ సింగ్ ఠాకూర్, ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి పి. కృష్ణ ప్రసాద్ ఉన్నారు. జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని యాపిల్ రైతులకు లాభసాటి ధరను అందజేయడం కోసం కేరళ దేశీయ మార్కెట్‌లో సహకార సంస్థలతో మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలపై చర్చించింది. ఉత్పత్తి వ్యయం అనేక రెట్లు పెరిగి రైతులకు రాబడి తగ్గడంతో మూడు రాష్ట్రాల యాపిల్ రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని ఎఎఫ్ఎఫ్ఐ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా పర్యటన సందర్భంగా, అమెరికా యాపిల్స్‌పై దిగుమతి సుంకాన్ని 70 శాతం నుంచి 50 శాతం వరకూ తగ్గించడంతో, అక్కడి నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి అవుతాయని చెప్పారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, బ్రోకర్లు, కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యం ఉన్న ప్రస్తుత మార్కెటింగ్ పద్ధతులతో యాపిల్ రైతు బలవంతపు విక్రయాల నుంచి బయటపడటానికి సహకార సంస్థల ఆధారంగా ప్రత్యామ్నాయ మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. విక్రయించిన ఉత్పత్తుల డబ్బు తరువాత ఎప్పటికో రైతులకు వస్తుందని, అది కూడా పూర్తిగా అందటం లేదని తెలిపారు. యాపిల్ రైతులు రైల్వే నెట్‌వర్క్‌ను ఉపయోగించి చండీగఢ్ నుంచి కొచ్చిన్‌కు 48 గంటల్లో రవాణా చేయవచ్చు, ఇది పండ్ల నాణ్యతను పెంచుతుందని తెలిపారు. యాపిల్ రైతులకు రాష్ట్రప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ హామీ ఇచ్చారు. ఎఎఫ్ఎఫ్ఐ కేరళలోని సహకార శాఖ మంత్రితో చర్చిస్తుందని, దీనికి సంబంధించి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికను అందజేస్తుందని ఆ సంఘం నేతలు తెలిపారు.

ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాల్సిందే : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి


విద్యుత్ ప్రతులను దహనం చేస్తున్న పాశం రామారావు తదితరులు

ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం మోపుతున్న భారాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్‌లో పెరిగిన విద్యుత్ బిల్లులపై ఇంటింటికీ తిరిగి వివరాలు తెలుసుకున్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక తాము ఇబ్బందులు పడుతున్నామని బాధితులు సిపిఎం నేతల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో సతమతమవుతున్న సామాన్యుడిపై ట్రూ అప్ ఛార్జీల భారం గోరుచుట్టు మీద రోకలిపోటులా తయారైందన్నారు. స్మార్ట్ మీటర్లతో రాబోయే కాలంలో ప్రజలపై మరో బాదుడు పడనుందని తెలిపారు. సామాన్యులను దోచి కార్పొరేట్లకు సంపద కట్టబెడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో నష్టాలంటూ ఆ భారాలను ఇప్పుడు మోపడం తగదన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారని తెలిపారు. దొడ్డిదారిన విద్యుత్ ఛార్జీలను పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యుత్ ఛార్జీల బిల్లుల ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, పి.గిరిజ, కె.ఉషారాణి, సిహెచ్.భుజంగరావు, కె.ప్రభాకరరావు, కె.కొండబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

ఒత్తిళ్లకు తలొగ్గి తప్పులు చేయొద్దు

- అధికారులకు పవన్ కల్యాణ్ హెచ్చరిక

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్లకు తలొగ్గి రెవెన్యూ రికార్డులను రెవెన్యూ అధికారులే మార్చేయడం, రోడ్డెక్కి న్యాయం అడిగితే పోలీసులే రైతులను కొట్టి జైలుకు పంపడం వంటి తప్పులు చేయడం ఇకపై మానుకోవాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. 2024 తర్వాత వైసిపి ప్రభుత్వం ఉండదని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత అధికారుల చిట్టా బయటకు తీసి చింపేస్తామని అన్నారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి పారిశ్రామికవాడలో భూములు కోల్పోయి పరిహారం అందని రైతులతో ఆదివారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వారాహి యాత్ర సందర్భంగా రైతులు ఏలూరు వచ్చి తమ సమస్యలను విన్నవించారని తెలిపారు. అందుకే రైతులతో ముఖాముఖి నిర్వహించినట్లు చెప్పారు. మల్లవల్లి రైతుల విషయంలో ప్రాంతం పేరు చెప్పి రెవెన్యూ అధికారులు రికార్డులు మార్చేయడం, రైతులకు డబ్బులు ఎగ్గొట్టడం వంటి పనులు చేశారని అన్నారు. అధికారుల తీరులో మార్పు రాకుంటే తరువాత తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పారని తప్పులు చేస్తూ పోతే తర్వాత వారే బలైపోతారనేది గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్, జిల్లా నాయకులు బండ్రెడ్డి రామకష్ణ, చలమల శెట్టి రమేష్, చిమట రవి వర్మ, మరీదు రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.


విహారయాత్రలో విషాదం

- కాలువలో కారు బోల్తా
- ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి


ప్రమాదానికి గురైన కారు

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి వద్ద ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలువలో కారు బోల్తా పడడంతో ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఏలూరు సమీపంలోని శ్రీ రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులు శనివారం ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలోని గుడెసె పర్యాటక ప్రాంతానికి రెండు కార్లలో వెళ్లారు. అక్కడ ఉల్లాసంగా గడిపి సాయంత్రం అవే కార్లలో తిరుగు పయనమయ్యారు. శనివారం అర్ధరాత్రి కోరుకొండ మండలం బూరుగుపూడి వద్ద ఒక కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కొండ కాలువలో పడిపోయింది. ఈ సమయంలో కారులో డ్రైవర్, ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో కాలువలోనుంచి కారుని బయటకు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏలూరు జిల్లా తంగెళ్లమూడికి చెందిన కారు డ్రైవర్ పలివెల ప్రణీత్, దెందులూరుకు చెందిన వేమూరి వంశీ, తూర్పుగోదావరి జిల్లా పెరవళి మండలం నడిపల్లికోటకు చెందిన కరటూరు హేమంత్‌లను అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగతా ముగ్గురి కోసం కాలువలో గాలించారు. తొలుత కృష్ణా జిల్లా గన్నవరం మండలం వీరవల్లికి చెందిన ఉదయ్‌కిరణ్ (19) మృతదేహాన్ని గుర్తించారు. ఏలూరు హనుమాన్ నగర్‌కు చెందిన టి.హేమంత్ (19), పెద్దపాడుకు చెందిన దూడే హర్షవర్ధన్ (19) మృతదేహాలు కూడా ఆ తర్వాత లభ్యమయ్యాయి. కొండ కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గాలింపు చర్యలు కష్టతరంగా మారాయని, ఎట్టకేలకు మృతదేహాలు లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు.



రాజ్యమా, మాట్లాడు ..!

నా గురించీ... నా నేల గురించీ
వలవలూడ్చి నడిరోడ్డు మీద
ఊరేగించబడ్డ నా నగ్నదేహం గురించీ
నా సోదరుడి తెగిన తల గురించీ
మాట్లాడు రాజ్యమా!
మౌనమొదిలి మాట్లాడు!

యేసును పూజించినందుకు
రామబాణం ప్రయోగించబడిన దాన్ని
కులాల కుంపటిలోకి నెట్టబడిన ఆదిమ తెగని
అడుగుతున్నాను రాజ్యమా! మాట్లాడు.

లౌకికతత్వం గురించి
నువ్వు మాట్లాడితే వినాలనుంది
యత్ర నారీ పూజ్యంతే... అని ఏదో వల్లిస్తావుగా
ఈ నేల మీద ఏ దేవతలు ఎలా నడుస్తుంటారో
నువ్వు చెప్తే వినాలనుంది... ఒక్కసారి మాట్లాడు
స్త్రీల హక్కుల గురించి మాట్లాడితే వినాలనుంది

ఇదే నేల మీంచి
చందమామ మీదకి అడుగుపెడుతున్న ఈ రోజుల్లో
ఒకే ఒక్క డోలో మాత్ర కోసం
డోలీల్లో గెడ్డ దాటుతున్న దృశ్యం గురించి
నువ్వు మాట్లాడితే వినాలనుంది
ఇక్కడి ఇండిజినస్ ఇండియన్‌ని అడుగుతున్నాను

రాజ్యమా! మాట్లాడు!
భిన్నత్వం పునాదుల్లోంచి మొలుచుకొచ్చిన విశాల వృక్షాన్ని
ఏకత్వం గురించి నువ్వు నిర్వచిస్తే వినాలనుంది
ప్రపంచమూ వినాలని ఎదురుచూస్తోంది
మాట్లాడు రాజ్యమా! మాట్లాడు!

నగ్నంగా నడిచింది నేనైనా...
బయటపడిన నగ్నత్వం నీదో కాదో నువ్వే చెప్పాలి

లౌకికత్వం గురించీ... సామరస్యం గురించీ...
సౌభ్రాతత్వం గురించీ... కులాల కుంపటి గురించీ...
మతం మంటల గురించీ...
నువ్వు మాట్లాడితే వినాలని ఎదురు చూస్తోంది ప్రపంచం

మాట్లాడు రాజ్యమా! మాట్లాడు!
మాయపొరలు విడిచి మాట్లాడు

ముక్కుపచ్చలారకుండానె చెరచబడి
సగం కాలిన హత్రాస్ నేలై నిలదీస్తున్నా...
రక్తమోడిన బాల్కిస్ బానోనై అడుగుతున్నా...
ఒక షెడ్యూల్డ్ నేలనై ప్రశ్నిస్తున్నా...
మండుతున్నది మణిపూరే అయినా
అంటుకున్నదేదో నువ్వు చెప్తే వినాలనుంది
దేహాల్ని దిష్టిబొమ్మను చేసి
దేశపటంలోంచి కాజేస్తున్న పంట గురించి
నువ్వు నిర్వచిస్తే వినాలనుంది
మాట్లాడు... ఒక్క మాట
రాజ్యమా! రామరాజ్యమా... సమాధానం చెప్పు!
నీ గొంతుతో సమాధానం చెప్తే వినాలనుంది
మాట్లాడు! గొంతు సవరించి మాట్లాడు!
మౌనం అర్ధాంగీకారం కానేకాదిప్పుడు...

ఇప్పుడు ...
మౌనం నేరాంగీకారం!

– మల్లిపురం జగదీష్

వెలుతురు వైపు ...

ఇప్పుడిక
మట్టి తన గురించి తనే మాటాడుకోవాలి!
నీరు తానే పల్లమై పదిమందికి పంచుకోవాలి!
అడవి తానే పాటై నలుదిశలా వినపడాలి...

ఎవరికి వారే గొంతు విప్పాల్సిన సమయమిది!
గోడు వినిపించాల్సిన సమయమిది!
కతలు కలబోసుకోవాల్సిన కాలమిది...

రాజ్యంతో పాటు కాలం కూడా తలారి పాత్ర
యింత నిర్దయగా నిర్వహిస్తున్న సమయంలో
ఇంకెవరికోసమో వేచి వుండాల్సిన కాలం కాదిది...

రా నేస్తం
మన దారి మనమే వెతుక్కుంటూ
చీకటి తెరలను తొలగించే
వెలుతురు వైపు పయనిద్దాం!

– కెక్యూబ్ వర్మ
94934 36277



దూరంలో ఉంటే ...

సమయానికీ స్థలానికే కాదు
దేశానికి కూడా దూరంగా
పిల్లలిపుడు
అన్ని సముద్రాలకావల
ఎలా తెలుస్తుంది?
ఎవరెక్కడ ఉన్నారో
ఎలా ఉన్నారో
పిల్లలు నవ్వుతారు గానీ
వాళ్లున్న దగ్గర
ఊహించని ఏ వార్త తెలిసినా
వాళ్లతో మాటాడే వరకూ
ఎన్ని శంకల ఊగిసలాటో
ఎన్నెన్ని ప్రయాసలో ...
బయటపడరు గానీ
ఇక్కడ నుండి ఏమి తెలిసినా
మనతో మాటాడేవరకూ
వాళ్లకీ అంతే !
కలుసుకుందుకో
ఏదోలా మాటాడుకుందుకో
ఏ వెసులుబాటూ లేకపోతే
ఎన్నాళ్ల గుంజాటనో
మనకైనా వాళ్లకైనా ...

– ముకుంద రామారావు
99083 47273

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం



వంద పుస్తకాలు రాయటం కన్నా, వేయి ప్రసంగాలు చేయటం కన్నా, రవ్వంత ఆచరణ చాలా ప్రయోజనకరం.
– కందుకూరి

ప్రజాపక్ష పాటల మోత గద్దర్ !



పాటకు మనిషిరూపం గద్దర్ అయితే, గద్దర్‌కి అక్షరరూపం పాట. గద్దర్ పాటకాలక్షేప సాధనం కాదు, అది శ్రమజీవుల చైతన్య గీతిక. సమాజం మారాలని, సమాజాన్ని మార్చాలని కోరుకునే రచయిత ఆ సమాజాన్ని ఆవరించిన, ఆ సమాజంలో ప్రజల్ని నడిపిస్తున్న తాత్విక భావజాలం నుంచి విముక్తం చెయ్యాలి. భూస్వామ్య వ్యవస్థలోను, పెట్టుబడిదారీ వ్యవస్థలోను, దైవసిద్ధాంతం మనిషిని ఆవరించి ఉంది. మనిషి ఉనికిని తిరస్కరించే ఆ సిద్ధాంతం నుంచి మనిషి విముక్తం కాకుండా సమాజంలో మార్పును తీసుకొని రావడం సాధ్యం కాదు. గద్దర్ తన పాటల్లో ఈ కర్తవ్యాన్ని నిర్వహించారు. అజ్ఞానం, భయం, అబద్ధంలోంచి అతి ప్రాచీన మానవుడు సృష్టించుకున్న దేవుణ్ణి స్వార్ధ పరశక్తులు వ్యవస్థీరించి విగ్రహాలను సృష్టించి, దేవుడిని సృష్టించిన మనిషినే ఆ దేవునికి బానిసను చేసి తమ పబ్బం గడుపుకుంటూ ఉండడం నేటికీ చూస్తున్నాం. శ్రమజీవులకు రాజ్యాధికారాన్ని కోరుకునే రచయిత ఈ వైనాన్ని బయట పెట్టాలి. గద్దర్ తన పాటతో ఆ పని చేశాడు.

"మతాలల్లో మర్మాన్ని ఇప్పి సెప్పుదాం/ దేవుండ్ల గుట్టంత బయటపెట్టుదాం/ గుణం లేని కులాల గుట్టు చెప్పుదాం/ హిందూమత పిచ్చిగాల్ల మత్తుదించుదాం.." అని పాడాడు, ఆడాడు.

ఈ భౌతికవాద తాత్త్విక అవగాహన లేకపోతే మనుషులను భావదాస్యం నుంచి విముక్తం చెయ్యడం వీలు కాదు. ప్రజల్ని భావదాస్యం నుంచి విముక్తం చెయ్యకుండా, జీవిత దాస్యం నుంచి విముక్తం చెయ్యడం సాధ్యం కాదు. గద్దర్ రాసిన ఈ పాట మనిషిని శ్రమదాస్యం నుంచే కాక, భావదాస్యం నుంచి కూడా విముక్తం చేస్తుంది. ఒక మతం వదిలి మరో మతంలోకి మారడాన్ని కూడా గద్దర్ హర్షించలేదు. "మతం మార్చుకుంటేనేమో/ మనసు చల్లబడ్డదాని/ కష్టాలు బోతయని/ క్రైస్తవ మతములో చేరితే/ కమ్మ క్రైస్తు రెడ్డి క్రైస్తు మాల క్రైస్తు మాదిగ క్రైస్తు / అంటరాని పిశాచము/ ఎంటబడుతున్నది.." అని పాడాడు. చీలిపోయిన మానవ సమాజాన్ని ఏకం చెయ్యాలంటే చీలికకు మూలాల్ని చీల్చి చెండాడాలని పిలుపునిచ్చాడు.

మార్పు కోరే కవికి సామాన్యుడే కేంద్రం. సామాన్యుని శ్రమ, దాని ఉత్పత్తి, అది సృష్టించే అదనపు విలువ, దాని ఫలానుభవం– ఇదే వామపక్షవాద రచయితకు ప్రమాణం. వీటి మధ్య న్యాయం శూన్యమైనప్పుడు రచయిత సామాన్యుని పక్షం వహిస్తాడు. శ్రమదోపిడికి బాసటగా ఉన్న రాజకీయాన్ని ఎండగడుతూ ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థకు స్వాగతం పలుకుతుంది ప్రజాసాహిత్యం. గద్దర్ భారతదేశంలోని ప్రకృతి సంపద, సామాన్యులు సృష్టించే సంపద, అది ఎవరికి చెందాలి, దానిమీద అధికారం చెలాయిస్తున్నదెవరు వంటి అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, దోపిడి మీద ప్రశ్నలను సంధించారు. గద్దర్ పాడిన 'భారతదేశం భాగ్యసీమరా' అనే పాట ఒక్కటి చాలు; భారతదేశ స్థితిగతులను సామాన్యునికి అర్థం చేయించడానికి. అందులో ఒక ప్రశ్న ఉంది. "సకల సంపదలు గల్ల దేశమున దరిద్రమెట్లుండోరో నాయనా" అన్నది ఆ ప్రశ్న. దానికి జవాబు రాబట్టడమే ప్రజా చైతన్యం.

'లేదురా యిటువంటి భూదేవి యెందు" అని స్వాతంత్ర్యోద్యమ కాలంలో పాడుకున్నాం. ఇంత గొప్ప దేశంలో – ఇంత ఆధ్యాత్మిక సాంస్కృతిక సంస్థలో మనుషులందరూ సాంఘిక ఆర్థిక సమానత్వంతో బతకడం లేదు. అవినీతి రాజ్యమేలుతున్నది. గద్దర్ దానినే తన పాటలో ప్రశ్నించారు. "నీతిగల్ల మనదేశంలోనా/ అవినీతెందుకు పెరిగిపోయెరా?" అన్నది ఆ ప్రశ్న. ఈ రెండు ప్రశ్నలకు ఏడు దశాబ్దాలకు మించిన చరిత్ర గల స్వతంత్ర భారత పాలకవర్గం సమాధానం చెప్పవలసి ఉంది.

ఏ పాట తీసుకున్నా అందులో శ్రామిక వర్గానికి చెందిన ఒక కులంవారిదో, కొన్ని కులాల సమూహానిదో, వృత్తులవారిదో జీవితాన్ని చిత్రించి వాళ్ళ శ్రమ దోపిడికి గురికావడాన్ని ఎత్తిచూపి, దానికి పరిష్కారంగా తిరుగుబాటును ప్రతిపాదించడం గద్దర్ నిర్మాణ పద్ధతి. ఆయన కవిత్వం నిండా శ్రామికవర్గం పరచుకొని ఉంది. ఆయన కవితలన్నీ శ్రామిక జీవిత చిత్రపటాలు. రైతుకూలీలు, వృత్తికారులు, కార్మికులు, గిరిజనులు, దళితులు, బహుజనులు, స్త్రీలు, కరువు పీడితులు, తుపాను బాధితులు ఆయన కవితల్లో కళారూపం పొందారు. శ్రమజీవుల 'విలాపాగ్నులకు విషాదాశ్రులకు' అక్షర చిత్రాలు గద్దర్ పాటలు. శ్రామిక నిర్దిష్టత గద్దర్ కవిత్వ లక్షణం. శ్రామిక భారతం ఆయన కవిత్వంలో వీరోచిత పోరాట రూపంలో ప్రతిబింబిస్తుంది. ఆయన రాసిన అనేక పాటల్లో శ్రమ పట్ల గౌరవం, మనిషి పట్ల ప్రేమ, జీవితం పట్ల నమ్మకం కలుగుతాయి. కన్నీళ్ళు లేని ప్రపంచాన్ని కోరుకోవడం కనిపిస్తుంది. ఏయే రంగాల్లో ఎవరెవరు ఎలా శ్రమిస్తూ కన్నీటి బతుకులు గడుపుతున్నారో కవిత్వీకరించి ఆ కన్నీటికి కారణాలను, దానికి విరుగుడును చెప్పారు గద్దర్. ప్రజలు పాడుకునే పాటల బాణీలలో ప్రజల జీవన పోరాటాన్ని ఆవిష్కరించిన గద్దర్ ప్రజా వాగ్గేయకారుడే!

మనదేశాన్ని గురించి మన పూర్వీకులు ఎన్నో గొప్పలు చెప్పారు. ఇప్పుడు కూడా అవి ఘనంగా వినబడుతూనే ఉన్నాయి. ఆ గొప్ప చెప్పేవాళ్ళు దళితవాడల గురించి నోరు మెదపరు. ఇక్కడ అంటరాని వాళ్ళున్నారు, వాళ్ళు నీచంగా హీనంగా చూడబడుతున్నారు అని అనరు. అందుకే గద్దర్ "బంగారుపంటలిచ్చె భారతగడ్డ మనది/ గంగమ్మ ప్రవహించే – పుణ్యభూమి మనది/ గంగాయమునా బ్రహ్మపుత్ర – కృష్ణా పెన్నా కావేరి ఎన్నెన్నో జీవనదులు – ప్రవహించే జీవగడ్డ/ మాలమాదిగన్నలకే మంచినీళ్ళు కరువాయె" అని 'పవిత్ర' భారతదేశ వాస్తవికతను ఎత్తిచూపాడు. మనువాద భూమికను ఎత్తిచూపిన గద్దర్, దళితుల్లోని అంతర్గత వైరుధ్యాలను కూడా ఎత్తిచూపి, మతమార్పిడి పరిష్కారం కాదని చెప్పి, "శ్రమ జీవుల విముక్తికై – పిడికిలెత్తి బాస చెయ్" అని విప్లవమార్గంలో ప్రయాణించమని ప్రబోధించాడు. ఆయన చరమాంక దశ మీద అభ్యుదయవాదులకు కొన్ని ఫిర్యాదులు ఉన్నాయి. అయినప్పటికీ– కొన్ని దశాబ్దాల పాటు గద్దర్ సాగించిన ప్రజాపక్ష పాటల ప్రయాణం చాలా ఉత్తేజకరమైనది, ఉన్నతమైనది. ఆదివారం నాడు (6.8.2023) కన్నుమూసిన ఆ ప్రజా వాగ్గేయకారుడికి జోహార్లు.

– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

'మోదుకూరి' ముందుచూపు ఇప్పటికీ వొక ఆశ్చర్యమే!



అతడు– గుంటూరు జిల్లా కొలకలూరు దళితవాడకు చెందిన గురవయ్య, రత్తమ్మలకు మూడవ సంతానం. చిన్ననాటి నుండి నటనలో ఆసక్తి, సాహిత్యంపై మక్కువ ఉన్న మావూరి మహ రచయిత మోదుకూరి జాన్సన్. నటుడుగా పలు నాటకాల్లో నాయకుడు పాత్రలో రాణించినవాడు. దర్శకత్వంలో మెళకువలతో 'మాస్టర్', 'దొంగవీరుడు' నాటకాల్లో ప్రతినాయకుడు పాత్ర ఆయనే. జాన్సన్ స్వీయ సంగీత దర్శకత్వంలో మధుర కవి నూతక్కి అబ్రహాం రచన 'పాపక్షమ' నాటకంలో క్రీస్తుగా శిలువ మీద కనిపించినవాడు– జాన్సన్. క్రైస్తవ సమాజంలో గుర్తింపు పొంది, అనేక ప్రదర్శనలతో ప్రసిద్ధికెక్కిన నాటకం ఇది.

'నటనాలయం', 'దేవాలయం', 'నీరద', 'శిలువ భారం' నాటకాలు కాకుండా అముద్రిత నాటకాలు, వైద్యసేవలు అంకితభావంతో అందించే 'బాధ్యత' నాటిక, వైద్య విద్యార్థులు ఎదుర్కొనే 'ర్యాగింగ్' భూతానికి 'పట్టాభిషేకం' పేరుతో రాసిన నాటికను అప్పటి వైద్య విద్యార్థులు ఇప్పటికీ మరిచిపోలేదు.

ఇలా కళాకారులకు నిలయమైన కొలకలూరు పల్లెలో జాన్సన్ చుట్టూ ఎప్పుడూ పదిమంది సందడి చేస్తూ ఉండేవాళ్ళు. నాటక రచయితలు అప్పుడే సినిమా ఇండస్ట్రీలోకి ప్రవేశిస్తున్న బ్లాక్ అండ్ వైట్ రోజులవి. అయితే అందరికీ అక్కడ నేరుగా ప్రవేశానికి అనుమతి ఉండేది కాదు. అక్కడ 'ఎంట్రీ రిస్ట్రిక్టెడ్' బోర్డు ఉండేది. అయితే తన ప్రతిభతో, అటువంటి మూసిన తలుపుల్ని తోసుకుని మరీ లోపలి చొచ్చుకుని వెళ్ళి, అక్కడ 'సెటిల్' అయినవాడు– జాన్సన్!

లాయరుగా తెనాలిలో ఉన్నప్పుడు, నటీనటుల ఆలయం– 'నటనాలయం' అంటూ కళాకారుల కష్టాల్ని కళ్ళకు కట్టినట్టు చెబుతూ రాసిన నాటకం– 'నటనాలయం'. అందులో ప్రతి నాయకుడి పాత్రలో జాన్సన్ కనిపించేవాడు. ఈ 'నటనాలయం' నాటకం ద్వారా అనేకమంది రచయితలకు, నటులకు ఆయన స్ఫూర్తినిచ్చారు. 'నటనాలయానికి' ఉత్తమ నాటక రచనకు ఆంధ్ర కళాపరిషత్తు గుర్తింపు రావడంతో, జాన్సన్‌కు మెడ్రాస్ దారి సులభతరం అయింది. అలాగే అది స్వస్థలం తెనాలిలో ఆయనకొక ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఈ నాటకం చూసి గుమ్మడి తన స్నేహహస్తం అందించడం, ఆదుర్తి, అక్కినేని ఆశీస్సులతో– 'మరో ప్రపంచం' చిత్ర రచనతో జాన్సన్ సినీ ప్రస్థానం మొదలయింది.

రచయితగా జాన్సన్ ఉద్దండులైన రచయితలు గొల్లపూడి మారుతీరావు, కొలకలూరి ఇనాక్ సమకాలీకులు. జాన్సన్ బి.ఎల్. చదువుతున్న రోజులవి. ఓ సభకు దాశరథి, 'సినారె' అతిథులుగా వచ్చిన సందర్భం– 'మాట్లాడే మల్లె మొగ్గ' అనే పాటకు కేవలం కొన్ని నిమిషాల్లోనే స్వరపరచి వేదికపై పాడి అలరించి ఆనాటి హీరోగా మారినవాడు– జాన్సన్. అప్పటికే జాన్సన్‌తో స్నేహంగా ఉన్న మారుతీరావు ఓ సభలో ఆ విషయం ప్రస్తావించడం, ఆ సభకు నేనే కన్వీనరుగా వ్యవహరించడం ఇప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం.

నాటక రంగం నుంచి వచ్చి సినీ రచయితలుగా మారి నిలదొక్కుకున్నవాళ్లలో– నరసరాజు, ఆత్రేయలకు దీటుగా నిలబడగలిగాడు మోదుకూరి జాన్సన్. 'మరో ప్రపంచం' తర్వాత తన కథ, సంభాషణలతో– 'మానవుడు దానవుడు' (1972) విజయంతో జాన్సన్ చిత్ర పరిశ్రమలో 'సెటిల్' అయిపోయాడు. అప్పట్లోనే, శోభన్ బాబుకు 'స్ప్లిట్ పర్సనాలిటీ' హీరో కథ రాసి సౌమ్యుడైన డాక్టర్ వేణు – 'రెబల్' జగన్ ఇలా ఒక్కరినే ఇద్దరుగా 'బ్లాక్ అండ్ వైట్' తెరమీద చూపించి, జాన్సన్ రచయితగా తన విశ్వరూపం చూపించారు. జాన్సన్ వన్లైన్ డైలాగులు– "నీవు భుజంగం– అంటే పామని తెలుసు, కాని... నేను పాములను ఆడించేవాడినని నీకు తెలియదు." "చిల్లర పనులు చేయడం ఈ జగన్ చేతకాదు. చిల్లర దేవుళ్ళకు ఈ జగన్ మొక్కడు" వంటి డైలాగులతో ఆ చిత్రంతో 'దటీజ్ జాన్సన్..' అనిపించుకొన్నాడు మోదుకూరి.

'డబ్బుకు లోకం దాసోహం' చిత్రంలో ఎలక్షన్లో నిలబడే సందర్భాల్లో ఎన్టీఆర్ బాబాయిగా మిక్కిలినేని అంటాడు : "చూడు బొగ్గుగా ఉన్నప్పుడు మాత్రమే చేత పట్టుకోవచ్చు. అది నిప్పుల్లో పడి నిప్పుకణికగా మారాక మాత్రం దాన్ని పట్టుకోలేం'. అప్పటి వరకు హీరోకి ఉండే పెద్ద డైలాగుల ధోరణికి భిన్నంగా క్లుప్త పదాలతో 'పంచ్ డైలాగ్' వేసే కొత్త ధోరణిని మొదటిసారి వెండితెరకు పరిచయం చేసినవాడు మోదుకూరి. టి.కృష్ణ దర్శకత్వంలో (1985) తయారైన సంచలనాత్మక చిత్రం– 'దేవాలయం'లో శంకరం (శోభన్ బాబు) పూజారిగా మారిన నాస్తికుడు. అతడు శ్మశానం కల్యాణవేదికగా గౌరి (విజయశాంతి) అనే దళిత యువతిని మంత్రోచ్చరణల మధ్య వివాహం చేసుకుంటాడు. మూడున్నర దశాబ్దాలు క్రితం అటువంటి సన్నివేశాన్ని తెరపై సృష్టించడం అనేది ఇప్పటికీ ఊహించడం కష్టమే!

'దేశోద్ధారకులు' స్వాగతం దొరా! స్వాగతం తేనె లొలుకు తెలుగు నేలకు అంటూ సాగే పాట కృష్ణా గోదావరి అమరమ్య ప్రస్తావనలతో తనదైన బాణిలో దేశభక్తిని ప్రదర్శించిన పాట, 'పాడిపంటలు' మన జన్మ భూమి–బంగారు భూమి పాడిపంటలతో పసిడి రాశులతో కళకళలాడే జనని మన జన్మభూమి రైతు లేనిదే రాజ్యము లేదంటా' పాడిన పాట. 'కరుణామయుడు'లో– 'కదిలింది కరుణరథం' ఇవన్నీ గీత రచయితగా ఆత్రేయ వంటివారి సరసన ఆయన్ని నిలుపుతాయి.

ఎవరీ జాన్సన్ అనే ప్రశ్నకు ఆయన ఓ నట వైతాళికుడు, గాయకుడు, రచయిత, కవి ఓ దళిత క్రైస్తవుడు– మా గుండెల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకొన్న మహామనిషి, మా పూరి తేజోమూర్తి, వాచస్పతి కొంగర జగ్గయ్యచే 'అగ్నికవి' అనిపించు కొన్న వాడు మా మోదుకూరి.

(ఆగస్టు 8 : మోదుకూరి జయంతి)

– డాక్టర్ వల్లూరి రామారావు
94908 77471

యుగే యుగే చీకటిలోంచి ...

కన్నీళ్ళతో ఈ మంటలు ఆరేవి కాదు
కవిత్వాలతో ఈ క్రోధం తీరేది కాదు
కాలం ఏదో తీగ మీటుతోంది
యుగే యుగే చీకటిలోంచి
జాగో జాగో పాట పాడుతోంది

ఎంత పెద్ద దేశం ఇది..
ఇంత చిన్న గుండెను ఎన్ని దీపాలు చేసి వెలిగించాలి!
గులాబీ రేకులనైనా
తాకడానికి వణికే చేతులు కదా మనవి
చిన్ని వెన్నెల చినుకు వాలినా చలించిపోయే రెప్పలు కదా
మనవి పసిపాపల ముందు

ఎగిరి గంతులేసి ఆడుకునే
ప్రాణం ఉన్న గులకరాళ్ళం కదా మనం
కాలం ఇప్పుడు ఏదో సైగ చేస్తోంది!

కాలం బలి వేదిక మీద
నక్షత్ర ఖచిత సత్యాయుధం
నృత్యం చేస్తోంది
యుద్ధం తప్పదు కాబోలు–
సిద్ధంగా ఉండాలి తమ్ముడూ!
ఆత్మల కాగడాలు పట్టి
అడుగులు వేయాలి అమ్మడూ!

మన నెత్తి మీద ఆకాశం ఎటో పారిపోకముందే
మన కాలి కింద భూమి ఎటో కూలిపోకముందే



ధర్మం వొరలోంచి దేహాలను తీసి
దేశం పాదాల ముందు పెట్టాలి!
మబ్బుల బుగ్గలు నిమిరే మృదువైన అరచేతులతో
పట్టాల్సి వస్తే ఆయుధం పట్టుకో తమ్ముడూ
పూలకు నవ్వుల తిలకాలు అద్దే
లేత చేతి వేళ్ళతో
పట్టాల్సివస్తే ఆయుధం పట్టుకో అమ్మడూ

ఇక మాటలతో సమరం కాదు
ఇది మౌనానికి సమయం కాదు
నువ్వో.. నేనో
ఒక మణిపూర్ కాకముందే
ధర్మ రక్షకుల చేతుల్లో
మన ప్రజాస్వామ్యం వివస్త్ర కాకముందే

తిరగబడు తిరగబడు తిరగబడు–
ఈ మాట అరిగిపోయినదే
అయినా లక్షసార్లు అంటాను


తిరగబడు తిరగబడు తిరగబడు–

కన్నీళ్ళతో ఈ మంటలు ఆరేవి కాదు
కవిత్వాలతో ఈ క్రోధం తీరేది కాదు

యుగే యుగే చీకటిలోంచి
జాగో జాగో పాట పాడు !

– ప్రసాదమూర్తి
84998 66699

పిల్లలను అలరించే ఆహో ఓహో ఇకిగాయ్



బాలలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, మానసిక వికాసాన్ని కలిగించేదే బాలసాహిత్యం. అలాంటి సదుద్దేశంతో రాసిన నవల 'ఆహో ఓహో ఇకిగాయ్'. ప్రజాశక్తి చిన్నారి శీర్షికలో ధారావాహికగా ప్రచురితమైన 'ఆహా ఓహో ఇకిగాయ్' ... ఇప్పుడు పుస్తక రూపంలో మన ముందుకు వచ్చింది.

ఈ పుస్తకం 9వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల అబ్బాయి అన్వేష్ కథ. మొబైల్ ఫోన్ వాడకమే ప్రపంచంగా బతుకుతుండే అన్వేష్ జీవితంలో అతని అత్తమ్మ పూర్ణిమ రూపంలో వచ్చిన మార్పులే ఈ నవల ఇతివృత్తం. తన కుమారుడిలో మొబైల్ ఫోన్ వాడకం తగ్గించడం ఎలా అన్న అన్వేష్ తండ్రి రత్నాకర్ ప్రశ్నకు జవాబుగా వాడిని తనతో పాటు విదేశాలకు తీసుకు వెళ్ళమని సూచిస్తుంది సైకాలజీ స్టూడెంట్ పూర్ణిమ. ఆ ప్రకారమే అన్వేష్‌ని తన బిజినెస్ ట్రిప్‌లో తీసుకువెళతాడు రత్నాకర్. ఆ విధంగా అన్వేష్ ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలను దర్శిస్తాడు. అంతకుముందే తన అత్తమ్మతో కలిసి మైసూర్ దగ్గర ఉన్న కరంజి సరస్సు మధ్యలో ఉన్న ద్వీపాన్ని దర్శిస్తాడు. ఆ ద్వీపంలో ఎన్నెన్నో సీతాకోకచిలుకలను చూస్తాడు. ఆ ద్వీపానికి 'అందాల సీతాకోక చిలుకల ద్వీపం' అని పేరు ఉన్నట్టు తెలుసుకొని ఆశ్చర్యపోతాడు.

తండ్రితో కలిసి ముందుగా జపాన్‌లోని ఒకినోవా ద్వీపం చూస్తాడు. దక్షిణ జపాన్, తైవాన్ల మధ్య ఉన్న ఆ దీవి పేరు ఒకినోవా. అక్కడి వారికి ఇకిగాయ్ ఉంటుందని విని, దాని అర్థం తెలుసుకొని ఆశ్చర్యపోతాడు. ఆ దీవిలో నివసించే వారంతా వద్దులతో సహా నిత్యం కష్టించి పనిచేస్తూ ఉంటారని తెలుసుకుంటాడు. వాళ్లంతా 90 ఏళ్ల వయసు దాటిన వాళ్ళు అయినప్పటికీ ఎంతో ఉత్సాహంగా పనిచేస్తూ కనిపిస్తారు. అవన్నీ అన్వేష్‌లో ఆలోచన రేకెత్తిస్తాయి. తరువాత తండ్రితో కలిసి ఇటలీలోని ప్రసిద్ధ పీసా గోపురం చూస్తాడు. దాని విశేషాలన్నీ కూడా తెలుసుకొని అబ్బురంగా మదిలో దాచుకుంటాడు.

తరువాత ఇజ్రాయిల్ దేశ రాజధాని జెరూసలెం వెళతాడు. అక్కడ మృత సముద్రాన్ని సందర్శించి, దానికా పేరు ఎలా వచ్చిందో తెలుసుకుంటాడు. ఆ సముద్రం మీద నడిస్తే కూడా మనుషులు మునిగిపోరని తెలిసి ఆశ్చర్యపోతాడు. ఆ సముద్రం మీద పడుకొని పుస్తకాన్ని చదివి అనుభూతి పొందుతాడు. తరువాత నెదర్లాండ్ రాజధానిఅంస్టర్ డ్యామ్ నగరంలోని వింతలూ విశేషాలు చూస్తాడు. అక్కడ పెద్ద చిన్న కాలువలు 165 ఉంటాయని, వాటి మీద 1281 వంతెనలు ఉంటాయని తెలుసుకొని మరింత ఆశ్చర్యపోతాడు. ఆ నగరాన్ని కాలువల నగరం అంటారని కూడా తెలుసుకుంటాడు.

తరువాత తండ్రితో కలిసి ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం చేరుకుంటారు. అక్కడ రంగులు మార్చే కొండను చూస్తాడు. ఆ కొండ రంగులు మార్చడం వెనుక ఉన్న శాస్త్రీయ కోణాన్ని కూడా తెలుసుకుంటాడు. తరువాత చైనా రాజధాని బీజింగ్ వెళతాడు. అక్కడ చైనా గోడను దర్శిస్తాడు. చైనా చక్రవర్తి క్వీన్ షి హుయాంగ్ చిన్న చిన్న రాజ్యాలు అన్నిటినీ ఏకం చేసి చైనా సామ్రాజ్యాన్ని స్థాపించాడని, మంగోలుల దాడులను ఎదుర్కోవడానికి చైనా ఉత్తర భాగంలో భారీ గోడను నిర్మింపచేసాడని, దానినే చైనా గోడ అని పిలుస్తారని తెలుసుకున్నాడు.

తరువాత అతడు జోగినాథం అనే ఒక వ్యక్తి చేతిలో కిడ్నాప్ కావడం, పడవ ప్రయాణం చేయడం, సముద్రంలో పడిపోవడం, ఒక దుంగ సాయంతో రక్షింపబడడం, ఎస్కిమోలను కలవడం, స్లెడ్జ్ బండిపై ప్రయాణించడం, మాస్కో నగరం చేరుకోవడం ... అలా అనేక మలుపులు తిరుగుతుంది నవల. ఈ నవలలో అన్వేష్ అనేకమార్లు తనకు ఎదురైన ప్రమాదాలను చాకచక్యంతో తప్పించుకుంటాడు. తనకు ఎంతో ఇష్టమైన మొబైల్ ఫోన్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యటన మీద దృష్టి పెడతాడు. ఈ నవల చదివించడం ద్వారా రచయిత బాలలను వేరొక ప్రపంచంలోకి తీసుకువెళ్లాడు. అనేక వింతైన ప్రదేశాలను పరిచయం చేశారు.

ఈ నవల చదవడం మొదలు పెడితే చివరి వరకు ఆగకుండా చదువుతారు పిల్లలు. మొబైల్ ఫోన్ వినియోగించడం వల్ల కలిగే మానసిక వికాసం కంటే కొత్త ప్రాంతాల్లో పర్యటించడం, అరుదైన కట్టడాలను, ప్రాంతాలను దర్శించడం వల్ల ఎక్కువ సమాచారం, విజ్ఞానం దొరుకుతుందని గ్రహిస్తారు. ఈ నవలా రచయిత పిల్లల మేలుకోరి అందించిన మంచి పుస్తకం ఇది. పిల్లలు ఈ పుస్తకాన్ని చదివి ప్రయోజనం పొందాలి. ఈ నవలను చదివించడం తమ బాధ్యతగా తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలచే తప్పక చదివించాలి. ఈ పుస్తకం కావలసినవారు నవరత్న బుక్ హౌస్, విజయవాడ వారిని ఫోన్లో 98480 82432 సంప్రదించవచ్చు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

జనం గొంతుక

ఓ ప్రజా కంఠం అస్తమించింది
ఒక తరం
విప్లవ పాట మూగబోయింది
చైతన్యగీతంతో మార్మోగిన
ఓ పోరాట స్వరం
గుండె ఆగిపోయింది
చరిత్ర పుస్తకంలో గద్దర్ పేజీ
చిరస్మరణీయమైపోయింది

రాజకీయ అస్తిత్వ సునామీలో
పోరుబాటై ప్రతిధ్వనించి
తిరుగుబాటు సంద్రంలో
ప్రజా యుద్ధ కెరటమై
ఎగిసిపడిన అస్తిత్వ చిరునామా .. గద్దర్

నాడు చైతన్య కెరటమై
నేడు గళం వీరుడై
ఒగ్గుకథై బుర్రకథై
పోరుగీతమై జనం గుండెచప్పుడై
కాలానికి ఎర్రబాటై నిలిచాడు

కోట్లాది మంది హృదయాల్లో
ఆరని జ్వాలై
రగులుతున్న నిప్పురవ్వల కొలిమై
ఎగిసే వెలుగు మంటల్లో
చిరస్థాయిగా గద్దర్
ప్రకాశిస్తూనే ఉంటాడు !

– రెడ్డి శంకరరావు
94943 33511

ఛత్తీస్‌గఢ్ స్టీల్‌ప్లాంట్‌లో పేలుడు

- కార్మికుడి మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని ఉక్కు ఫ్యాక్టరీలో ఆదివారం పేలుడు సంభవించడంతో ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. రస్మారాలోని రాయ్‌పూర్ స్టీల్ ప్లాంట్‌లో స్టీల్ కరిగించే పని జరుగుతుండగా పేలుడు సంభవించింది. ఘటనా స్థలంలో కనీసం వంద మందికి పైగా కార్మికులు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రమదంలో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సెక్టార్ 9 భిలాయ్‌లోని జెఎల్ఎన్ మెమోరియల్ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఖేమ్లాల్ సాహు (38) మరణించినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు కార్మికుల పరిస్థితి నిలకడగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నుహ్‌లో వరుసగా నాలుగోరోజు కొనసాగుతున్న కూల్చివేతలు

ఛండీగఢ్ : హర్యానాలోని నుహ్ జిల్లాలో వరుసగా నాలుగోరోజైన ఆదివారం కూడా కూల్చివేతలు కొనసాగాయి. సహారా హోటల్‌ను ప్రభుత్వం కూల్చివేసింది. ఈ హోటల్ పై కప్పు నుండే కొందరు వ్యక్తులు మతపరమైన ఊరేగింపుపై రాళ్లు రువ్వారని అధికారులు ఆరోపిస్తున్నారు. అరెస్టులకు భయపడి చాలా మంది ఊరి నుండి పారిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. హర్యానా సిఎం మనోహర్ లాల్ ఖట్టర్ ఆదేశాల మేరకు ఈ కూల్చివేత చేపట్టినట్లు నుహ్ ఎస్‌డిఎం అశ్విని కుమార్ తెలిపారు. హర్యానాలోని నూహ్ జిల్లాలో ఇటీవల మత హింసకు కారణమంటూ గత మూడు రోజులుగా పలు దుకాణాలను, నివాసాలను రాష్ట్రప్రభుత్వం కూల్చి వేస్తున్న సంగతి తెలిసిందే.

జైపూర్ మేయర్‌పై వేటు

జైపూర్ : జైపూర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మునేష్ గుర్జార్‌ను రాజస్తాన్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆమె భర్త సుశీల్ గుర్జార్‌ను రాష్ట్ర అవినీతి నిరోధక బ్యూరో శనివారం అరెస్ట్ చేసింది. ఆమెను కూడా సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేటర్ పదవి నుంచి కూడా ఆమెను సస్పెండ్ చేసింది. మేయర్ మునేష్ గుర్జార్ భర్త సుశీల్.. ఓ భూమి లీజ్ వ్యవహారంలో రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ శనివారం ఎసిబికి దొరికిపోయారు. ఆ సమయంలో మేయర్ అక్కడే ఉన్నారు. ఆ ఇంటి నుంచి ఎసిబి అధికారులు రూ.40 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. మేయర్ మునేష్ గుర్జార్ కేసు విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో ఆమెపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో మరో ఇద్దరిని ఎసిబి అరెస్టు చేసి విచారిస్తోంది.

యుఐడిఎఫ్ ప్రాజెక్టుల వివరాలు అందించండి

- రాష్ట్రాలను కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యుఐడిఎఫ్) కింద దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కేటాయించిన పది వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం కోరింది. కేంద్ర బడ్జెట్‌లో ఈ నిధిని ప్రకటించిన విషయం తెలిసిందే. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ నిధిని ఉద్దేశించారు. ఐదు కోట్ల నుంచి వంద కోట్ల రూపాయల వరకూ ఖర్చయ్యే ప్రాజెక్టులకు ఈ నిధి నుంచి సాయం అందుతుందని కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడిఎఫ్) తరహాలోనే యుఐడిఎఫ్‌కు బడ్జెట్‌లో ఏటా పది వేల కోట్ల రూపాయలు కేటాయిస్తారు. దీని కింద ప్రస్తుతం 459 ద్వితీయ శ్రేణి, 580 తృతీయ శ్రేణి నగరాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఈ నిధిని అమలు చేసేందుకు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. లక్ష నుండి 99,99,999 వరకూ జనాభా ఉన్న నగరాలను ద్వితీయ శ్రేణి నగరాలుగా, యాభై వేల నుండి 99,999 వరకూ జనాభా కలిగిన నగరాలను తృతీయ శ్రేణి నగరాలుగా పరిగణిస్తారు. రుణ రూపంలో అందించే సాయంతో 11 రకాల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడతారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందకపోవడంతో ప్రత్యేకించి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ఈ నిధిని కేటాయించారు.

చైనాలో భూకంపం..

బీజింగ్ : తూర్పు చైనాలో ఆదివారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. రాజధాని బీజింగ్‌కు దక్షిణంగా 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న డెజౌ నగరానికి సమీపంలో భూమి కంపించింది. రిక్టర్‌స్కేలుపై తీవ్రత 5.5గా నమోదైనట్లు యుఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో 24 మంది మృతి

మొరాకో : ఆఫ్రికాలోని మొరాకోలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మొరాకోలోని అజిలాల్ సెంట్రల్ ప్రావిన్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 24 మంది మరణించారని అధికారులు వెల్లడించారు. డెమ్నాట్ పట్టణంలోని వీక్లీ మార్కెట్‌కు ప్రయాణికులను తీసుకెళ్తున్న మినీబస్సు బోల్తా పడడంతో వారు మరణించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

మణిపూర్‌లో 15 నివాసాలకు నిప్పు

- కొనసాగుతున్న హింస



ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. పశ్చిమ ఇంఫాల్ జిల్లా లాంగోల్ గేమ్స్ గ్రామంలోశనివారం రాత్రి అల్లరి మూక దాడి చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. వారు నిప్పు పెట్టడంతో 15 నివాసాలు దగ్ధం కాగా, ఒకరు గాయపడ్డారని చెప్పారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు, అల్లరి మూకను చెదరగొట్టేందుకు పోలీసులు పలు రౌండ్లు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చిందని వివరించారు. కాల్పుల్లో 45 ఏళ్ల వ్యక్తి గాయపడ్డాడని, ఎడమ తొడపై బుల్లెట్ గాయమైన అతనిని రిమ్స్ ఆస్పత్రిలో చేర్చామని తెలిపారు. ప్రస్తుతం అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని చెప్పారు. ఇంఫాల్ ఈస్ట్ జిల్లా చెకాన్‌లో ఓ పెద్ద వాణిజ్య సముదాయానికి దుండగులు నిప్పుపెట్టారు. సమీపంలోని మూడు ఇళ్లకు కూడా నిప్పు పెట్టారు. అగ్నిమాపక దళాలు మంటలను ఆర్పివేశాయి. గత మే నుంచి ఇప్పటివరకూ ఆ రాష్ట్రంలో జరిగిన హింసాకాండలో అధికారిక లెక్కల ప్రకారమే 160 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

మణిపూర్, మిజోరాంలలో రోహింగ్యా శరణార్థుల బయోమెట్రిక్ వివరాల సేకరణ

కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు మణిపూర్, మిజోరాం రాష్ట్రాల్లో ఆశ్రయం పొందుతున్న మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యా శరణార్థుల బయోమెట్రిక్ వివరాల సేకరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రం ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 30 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి వచ్చింది. ఆలోపు వివరాల సేకరణ సాధ్యం కాదని మిజోరాంలోని జోరమ్‌తంగా ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది. అధికారిక లెక్కల ప్రకారం మిజోరాంలో 35,126 మంది మయన్మార్ శరణార్థులు ఉన్నారు. వీరిలో 15,589 మంది సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. 19,458 మంది అద్దె ఇళ్లలో లేదా బంధువుల వద్ద ఉంటున్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లోని సజ్వా జైలు సమీపంలో రాష్ట్రప్రభుత్వం శరణార్థుల కోసం ఏర్పాటు చేసిన డిటెన్షన్ సెంటర్‌లో బయోమెట్రిక్ వివరాల సేకరణను ప్రారంభించారు. ఇక్కడ 104 మంది ఉంటున్నారు. మణిపూర్ వ్యాప్తంగా అక్రమ వలసదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటివరకూ 2,500 మందిని గుర్తించామని తెలిపారు. చందేల్ జిల్లాలో 1050 మందిని గుర్తించినట్లు చెప్పారు.

ఐదుగురు పోలీసుల సస్పెన్షన్

మణిపూర్‌లో మే 4న ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ప్రాంతంలోని ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు అధికారులు ఆదివారం ప్రకటించారు. తౌబాల్ జిల్లా నాంగ్‌పాక్ సెక్మాయ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి, మరో నలుగురు పోలీసులను సస్పెండ్ చేయాలని మణిపూర్ పోలీసు శాఖ నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 3న బిష్ణుపూర్ జిల్లా నరన్సీనాలో ఉన్న 2వ ఇండియా రిజర్వ్ బెటాలియన్ (ఐఆర్‌బి) ప్రధాన కార్యాలయం నుంచి ఆయుధాలు, 19 వేల బుల్లెట్లు దోపిడీ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఆధ్వర్యంలో ఆరు వారాల కాలపరిమితితో కూడిన విచారణకు రాష్ట్ర పోలీసులు ఆదేశించినట్లు చెప్పారు.

మణిపూర్ సర్కారుకు కెపిఎ మద్దతు ఉపసంహరణ

బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి కుకీ పీపుల్స్ అలయన్స్ (కెపిఎ) మద్దతు ఉపసంహరించుకుంది. కెపిఎ అధ్యక్షుడు టోంగ్‌మాంగ్ హౌకిప్ మణిపూర్ గవర్నర్ అనుసూయా ఉకేకి ఈ మేరకు లేఖ రాశారు. బిజెపితో బంధాన్ని తెంచుకోవాలనే పార్టీ నిర్ణయాన్ని గవర్నర్‌కు తెలియజేశారు

కొల్‌కతాలో నిరుద్యోగుల నిరసన

రైల్వేలో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్



కొల్‌కతా : రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న మూడు లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ కొల్‌కతాలో నిరుద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ నిరుద్యోగుల జాయింట్ ఫోరం ఆధ్వర్యంలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) కార్యాలయం ఎదుట ఈ ప్రదర్శన జరిగింది. అసిస్టెంట్ లోకో పైలట్, టెక్నీషియన్, జూనియర్ ఇంజినీర్, ఎన్‌టిపిసి గ్రూప్ సి, డి పోస్టులు సహా ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ప్రదర్శన అనంతరం ఫోరం ప్రతినిధి బృందం అధికారులకు మెమొరాండం సమర్పించింది. నియామక ప్రక్రియను రూపొందిస్తున్నామని, త్వరలోనే పరీక్ష తేదీని ప్రకటిస్తామని అధికారులు హామీ ఇచ్చారని బృందం సభ్యులు విలేకరులకు తెలిపారు. 2019 నుండి ఉద్యోగ నియామక నోటిఫికేషన్ విడుదల చేయనందున అభ్యర్థుల వయోపరిమితిని సడలించాలని ఫోరం డిమాండ్ చేయగా, అధికారులు ఎలాంటి హామీ ఇవ్వలేదు.

ఫోరం తరపున సిఐటియు నేత ఇందర్‌జిత్ ఘోష్ మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, రోజ్‌గార్ మేళాలో ఉద్యోగాలు ప్రకటిస్తామని చెప్పారని, కానీ చేసిందేమీ లేదని విమర్శించారు. నియామకాల ప్రక్రియ ప్రారంభించని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. పరిమిత సంఖ్యలో పనిచేస్తున్న ఉద్యోగులపై పని భారం పెరగడం వల్లనే కోరమాండల్ రైలు ప్రమాదం జరిగిందని ఆయన చెప్పారు.

వేతనాలు పెంచండి


- బడ్జెట్ కేటాయింపులు కూడా...
- ఉపాధి హామీ పథకంపై ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సు

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లబ్దిదారుల వేతనాలను గణనీయంగా పెంచాలని ఉన్నతస్థాయి కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుత వార్షిక పెరుగుదల కంటే వేతనాలు ఎక్కువగానే అందజేయాలని తెలిపింది. ఈ పథకానికి బడ్జెటరీ కేటాయింపులు సైతం పెంచాలని సిఫార్సు చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి అమర్‌జిత్ సిన్హా నేతృత్వంలో ఏర్పడిన ఈ కమిటీ ఉపాధి పథకాన్ని మరింత సమర్ధవంతంగా రూపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలను సూచించింది. వేతనాలు పెంచాలని సూచించిన కమిటీ, ఎంత మేరకు పెంచాలో మాత్రం చెప్పలేదు. ఉపాధి పథకంలో చెల్లించే వేతనాలు వ్యవసాయ, గ్రామీణ వేతనాలకు సూచికగా ఉండడంతోపాటు పారిశ్రామిక వేతనాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో వేతనాలు ఏ మేరకు పెంచాలో నిర్ణయించే అధికారాన్ని ఉన్నతస్థాయి కమిటీ ప్రభుత్వానికే వదిలేసింది.

కార్మికుల వేతనాలు పెరిగితే గ్రామీణ ప్రాంతాలలో కొనుగోలు శక్తి, వినియోగం పెరుగుతాయి. వార్షిక వేతన పెరుగుదల రేటును ధరల సూచీ (వ్యవసాయ కార్మికుల)తో కాకుండా గ్రామీణ వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా నిర్ణయించాలని కమిటీ సూచించింది. వేతనాలను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి మదింపు చేయాలని అభిప్రాయపడింది. కమిటీ తన నివేదికను గత నెలలోనే గ్రామీణాభివృద్ధి శాఖకు సమర్పించినప్పటికీ దానిని ఇంకా ప్రజలకు బహిర్గతం చేయలేదు.

ప్రజాశాస్త్రవేత్తకు శుభాకాంక్షలు

నేడు ప్రొఫెసర్ స్వామినాధన్ 98వ జన్మదినం



2023, ఆగస్టు 7 ప్రొఫెసర్ స్వామినాధన్ 98వవ పుట్టిన రోజు. రైతు కేంద్రంగా, కుటుంబ వ్యవసాయం నడవాలని తన "జాతీయ రైతు కమిషన్" వేదికల్లో పొందుపరచిన ఈ ప్రజా శాస్త్రవేత్తకు శుభాకాంక్షలు తెలుపుదాం. ఆహార భద్రతా చట్టం అమలులో, పౌరులకు పౌష్టికాహార లభ్యత విషయంలో భారతదేశం కూడా బాధ్యతగా ఉండాలని త్రికరణశుద్ధిగా కోరుకొనే ఈ శాస్త్రవేత్త ఆరోగ్యం బాగుండాలని కోరుకొందాం. "ప్రొ.స్వామినాధన్ పరిశోధనా సంస్థ, చెన్నై" వృద్ధి చెందాలని కాంక్షిద్దాం.

వలసవాదుల హ్రస్వదృష్టి ప్రణాళికల ఫలితంగా భారతదేశం తిండిగింజల పరంగా 1950 వరకు దిగజారుతూ వచ్చింది. బెంగాల్ కరువుల వంటివి దేశ ఆహార రంగాన్ని పరాదీనంగా మార్చాయి. అందుకే ఆనాటి స్థితిని "ఓడ నుండి నోటి వరకు" గా వర్ణించారు. నాటి నెహ్రూ నాయకత్వ ప్రభుత్వం, ఏదైనా ఆగవచ్చు కాని ఆహార (వ్యవసాయ) రంగం ఆగకూడదనుకొంది. దానికి తగ్గ ప్రణాళికల్ని రూపొందించుకొంది. రెండు దశాబ్దాల్లో ఆహారపరంగా స్వయం సమృద్ధి గాడిలో పడటం మొదలయ్యింది. మరో దశాబ్ద ప్రణాళికల వల్ల తిండిగింజల ఉత్పత్తిలో దేశం నిలబడగలిగింది. అలీనోద్యమ వరవడికి చోదకశక్తిగా భారతదేశం రూపొందింది. దీని వెనుక ఆనాటి రాజకీయ నాయకత్వం - జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, సుబ్రమ్మణ్యం-రిచా రియా, రణదవా, యం.వి.రావు, గంగాప్రసాదరావు, ప్రధాన్, స్వామినాధన్ వంటి శాస్త్రవేత్తల సహకారంతో రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగాన్ని మార్చగలిగింది. దాన్నే విలియం గాడ్, నార్మన్ బోర్లాగ్ వంటి వారు "హరిత విప్లవ" మన్నారు. గోధుమ, వరి, మొక్కజొన్న, జొన్న వంటి ముఖ్య ఆహార పంటల ఉత్పత్తి దేశాన్ని మలుపు తిప్పింది. స్వామినాధన్‌కు "ప్రపంచ ఆహార పురస్కారం" (వరల్డ్ ఫుడ్ ప్రైజ్) వంటివి లభింపజేసింది. ఆహార రంగ వివిధ శాఖలు విస్తరించి, దేశ వ్యవసాయ పరిశోధనా రంగాల నిలయంగా మార్చబడ్డది. 21వ శతాబ్దం నాటికి 275 మి.ట. తిండిగింజల్ని ఉత్పత్తి చేయించగలిగింది. పంటల ఉత్పత్తుల పంపకంలో తగిన ప్రణాళిక ఆచరించబడలేదు. ఫలితంగా "ఆహార భద్రత" పౌరులందరికీవిస్తరించబడలేదు. ఈ విషయాన్ని అంతర్జాతీయ సంస్థ (యుఎన్‌డి) తన ఆహార వ్యవసాయ విభాగం (ఎఫ్.ఎ.ఒ) ద్వారా గుర్తుచేస్తూ వచ్చింది. స్వామినాధన్ వంటి వ్యవసాయరంగ నిపుణులు కూడా పదేపదే ప్రభుత్వం దృష్టికి తెస్తూనే ఉన్నారు. "సహస్రాబ్ది (మిలీనియం) అభివృద్ధి లక్ష్యాల" ప్రకటన ద్వారా భారతదేశం వంటి అభివృద్ధి చెందే దేశాలకు "జీరో హంగర్" (ఆకలిలేని దశ) గమ్యాన్ని సూచించారు. పార్లమెంట్ నామినేటెడ్ సభ్యుడిగా కూడా స్వామినాధన్ ప్రభుత్వానికి ఆ విషయం నివేదించారు. దాని ఫలితమే 2013లో భారతదేశ "ఆహార భద్రతా చట్టం" ఆచరణలోకొచ్చింది. ఉపాధి హామీ చట్టం ద్వారా "ఆహారం" హక్కుగా పరిగణించబడ్డది.

ప్రజా పంపిణీ వ్యవస్థ కీలకమైన ప్రభుత్వ నిర్వహణ బాధ్యతగా మార్చబడ్డది. పౌష్టికాహార లభ్యత పరంగా భారతదేశం యింకా వెనకబడే ఉందని గణాంకాలు సూచిస్తూనే ఉన్నాయి. దేశంలో తగినంతమంది (18 శాతం) యింకా ఆహారం అందని స్థాయిలో ఉన్నట్లు తేలింది. పౌష్టికాహార లభ్యత పరంగా యింకా ఎక్కువమంది ప్రతికూలతలోకి నెట్టబడ్డట్టు గుర్తించబడ్డది. కారణాలేమిటి? చర్చించబడాల్సిన అంశం.

ఆహార సంక్షోభ పరంగా ప్రపంచ నివేదిక-2022 ప్రకారం, దాదాపు 80 కోట్లమంది ప్రజలు ఆహార అందుబాటుకు దూరంగానే ఉన్నారు. ముఖ్యంగా ప్రపంచం ఎదుర్కొన్న "కరోనా" దాడి తరువాతి దశలో కూడా ఆకలికి గురౌతున్న జనాభా పెరుగుతూ వస్తున్నారని గణాంకాలు సూచిస్తూనే ఉన్నాయి. దానికి కారణం ప్రపంచాన్ని ఆవహించిన ఆర్థిక సంక్షోభం. ఫలితంగా అందకుండాపోతున్న ఆహార ధరలు, ఉత్పత్తి ఖర్చులు పెరగడం, వాతావరణ సంక్షోభ వరవడి వంటివి ప్రభావితం చేస్తున్నాయి. వీటికి తోడు ఉక్రెయిన్ యుద్ధం, ఆకలి చావుల్ని పెంచింది. ఆహార కొరతను ఎదుర్కొంటున్న జనాభా గణాంకాల ప్రకారం ఆఫ్రికా, ఆసియా దేశాలు ప్రముఖంగా ఉన్నాయి. ఇందులో భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ కూడా ఉండటం గమనంలో ఉంచుకోవాలి.

ఆహార భద్రత నిర్వచనం ప్రకారం, ప్రజలందరికీ భౌతికంగా, ఆర్థికంగా తగినంత ప్రమాణంలో పౌష్టికాహార లభ్యత. అనగా పౌరుడు ఆరోగ్యకరంగా, విధి నిర్వహణ పరంగా ప్రయోజనం పొందాలి. ఆహార భద్రత చట్టం చేయబడ్డ భారతదేశంలో కూడా యిది సాధ్యపడలేదనే చెప్పుకోవాలి. సరైన ఆహార లభ్యత ఉన్న దేశంలో పిల్లల పెరుగుదల, స్త్రీల రక్తపుష్టి, పౌరులందరి మానసిక శారీరక దారుఢ్యం సరిగ్గా ఉంటుందని కొన్ని ఐరోపా దేశాల గణాంకాలు సూచిస్తున్నాయి. భారతదేశం వంటి దేశాల్లో యింకా పిల్లల ఎదుగుదల సరిగ్గా లేక, స్త్రీల రక్తహీనత బయటపడుతూనే ఉన్నదని తేలింది. పౌష్టికాహార లోపాలు పెరిగి ఊబకాయ పౌరులు సంఖ్యాపరంగా పెరుగుతూ వస్తున్నారు. ఈ వరవడి 2030 నాటికి మన దేశ జనాభాలో పరిగణించదగినంత మంది ఆరోగ్య సమస్యల వలయంలో చిక్కుకుంటారని అర్థమౌతున్నది.

"జీరో హంగర్" స్లోగన్‌తోనూ, ఆహార భద్రత చట్టంతోనూ పౌరుల్ని మభ్యపెట్టే ధోరణి విడనాడి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ప్రజాపంపిణీ వ్యవస్థను విస్తరింప చేయాలి. ఆధునిక సాంకేతికాల సహకారంతో "ఫుడ్ పోర్టిఫికేషన్" (పౌష్టికాహార రూపకల్పన) చేసి అందరికీ అందుబాటులోకి తేవాలి. కేవలం ప్రకృతి వ్యవసాయం పర్యావరణ పరిరక్షణ అనే నినాదాలతో సమస్య పరిష్కారం కాదు. ఆవు ద్వారా లభించే ప్రయోజనాన్ని అతిగా పరిగణించి మిగిలిన పాడి, మాంస జంతువులను అలక్ష్యం చేసే పరిస్థితి ఉండకూడదు. వ్యవసాయ రంగ ఉద్ధరణలో మత్స్య, కోడి, గొర్రె పెంపకాల్ని విస్తరింపచేయాలి. వాటి ఉత్పత్తిదారులకు అనుకూల సహకారాన్ని అందించాలి. 2017-2021 భారతదేశ రైతు ఉద్యమాలు దేశ ఆహార భద్రతకు మేల్కొలుపుగా భావించి ఆహార ఉత్పత్తిదారుల, వినియోగదారుల మధ్య సమన్వయం కల్పించాలి. అప్పుడే "ఆహార హక్కు" చట్టానికి అర్థముంటుంది.

ప్రొ.ఎన్.వేణుగోపాలరావు

జపాన్ సైనికీకరణతో ముప్పు

- రక్షణ రంగ శ్వేతపత్రంపై చైనా


బీజింగ్ : పెరుగుతున్న సైనికీకరణతో ప్రాంతీయ, ప్రపంచ శాంతికి జపాన్ ముప్పుగా పరిణమిస్తుందని చైనా వ్యాఖ్యానించింది. రక్షణ వ్యయంపై జపాన్ తాజాగా విడుదలజేసిన శ్వేతపత్రంపై చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం స్పందించింది. జపాన్ తన సైనిక వ్యయాన్ని ఇదివరకెన్నడూ లేనంత గరిష్ట స్థాయిలో పెంచిందని, దీనిని సమర్థించుకోవడానికి తమను బూచిగా చూపిస్తోందని చైనా రక్షణ శాఖ ప్రతినిధి విమర్శించారు. జపాన్ సైనిక విస్తరణవాదం ప్రాంతీయ, ప్రపంచ శాంతి , సుస్థిరతలకు చేటు అని ఆయన అన్నారు. కిషిదా కేబినెట్ ఆమోదించిన ఈ శ్వేత పత్రం-2023 జపాన్ సైనికీకరణవైపు దూకుడుగా వెళ్తున్న విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. జపాన్ యుద్ధానంతర రక్షణ విధానం నుంచి సైనికీకరణ వైపు మళ్లుతోందని ఆయన తెలిపారు. సముద్ర సమస్యలను పరిష్కరించుకునేందుకు స్థిరమైన, నిర్దిష్టమైన నిబంధనలున్నాయి. దీనికి విరుద్ధంగా కొన్ని దేశాలు తమ సైనిక పరాక్రమాన్ని చాటుకోడానికి దక్షిణ చైనా సముద్ర జలాల్లోను, తైవాన్ జల సంధి మార్గంలోకి తమ యుద్ధ నౌకలను, విమానాలను పంపి ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొట్టే యత్నం చేస్తున్నాయని ఆయన అన్నారు. గత ఏడాది డిసెంబరులో జపాన్ ప్రభుత్వం వివాదాస్పద జాతీయ భద్రతా వ్యూహాన్ని ప్రకటించిన తరువాత వెలువడిన మొదటి శ్వేతపత్రం ఇది.

పాక్‌లో పట్టాలు తప్పిన రైలు..

- 33 మంది మృతి, 80 మందికి గాయాలు..



కరాచీ : పాకిస్తాన్‌లో ఆదివారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. రావల్పిండి వెళ్తున్న హజారా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 10 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో 33 మంది మరణించగా, 80 మంది గాయపడ్డారు. అక్కడి మీడియా కథనం ప్రకారం, షాజాద్‌పూర్ , నవాబ్‌షా మధ్య ఉన్న సహారా రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం సంభవించింది. గాయపడిన వారిని నవాబ్‌షాలోని పీపుల్స్ మెడికల్ హాస్పిటల్‌లో చేర్చారు. రైలు పట్టాలు తప్పడానికి కారణం ఇంకా తెలియరాలేదు. ప్రమాదం తర్వాత సమీపంలోని ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ ప్రోటోకాల్‌ను అమలు చేశారు. దెబ్బతిన్న బోగీల నుంచి ఇప్పటి వరకు 33 మంఇ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు పాకిస్తాన్ రైల్వే డిప్యూటీ సూపరింటెండెంట్ మహమూద్ రెహ్మాన్ ధ్రువీకరించారు. రైలు వేగం అంతగా లేదని ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఆ మార్గంలో వెళ్లే రైళ్లను తాత్కాలికంగా నిలిపివేసినట్టు రైల్వే అధికారులు చెప్పారు.



ఎఎస్ఐ సర్వే నేపథ్యంలో ఏర్పాటుచేసిన భద్రతా ఏర్పాట్లు

మూడోరోజూ జ్ఞానవాపి మసీదులో సర్వే

- వదంతులు వ్యాప్తి చేస్తే బహిష్కరిస్తాం : మసీదు కమిటీ

వారణాసి : ఇక్కడి జ్ఞానవాపి మసీదులో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) అధికారులు మూడోరోజైన ఆదివారం సర్వే కొనసాగించారు. 17వ శతాబ్దపు మసీదు ముందుగా నిర్మించారా? లేక అంతకుముందున్న నిర్మాణంపై మసీదును నిర్మించారా? అనే అంశం నిర్ధారించేందుకు జ్ఞానవాపి మసీదు వద్ద సర్వే నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సర్వే కొనసాగిందని ప్రభుత్వ న్యాయవాది రాజేష్ మిశ్రా తెలిపారు. ఈ నెల 4న బేస్‌మెంట్ సర్వేలో విగ్రహాలు, త్రిశూలం, కలశం లభ్యమయ్యాయని ఓ వర్గం మీడియా శనివారం పుకార్లు వ్యాపింపజేసిందని మసీదును నిర్వహిస్తున్న అంజుమన్ ఇంతే జామియా కమిటీ జాయింట సెక్రటరీ సయ్యద్ మహ్మద్ యాసిన్ తెలిపారు. ఇలాంటి వదంతులకు అడ్డుకట్ట వేయకపోతే సర్వే పనులను బహిష్కరిస్తామని చెప్పారు. జ్ఞాన్‌వాపి మసీదులో ఎఎస్ఐ సర్వేపై అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించిన సంగతి తెలిసిందే. సర్వే సమయంలో ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడవద్దని ఎఎస్ఐని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్థివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కోరింది.



ఫ్రాన్స్‌తో ఒప్పందాలు నిలిపివేత

- నైజర్ సైనిక పాలకుడు వెల్లడి

అబుజా: జులై 26 తిరుగుబాటు ద్వారా అధికారం చేజిక్కించుకున్న సైనిక జుంటా గతంలో ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న మిలిటరీ ఒప్పందాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాడు. తిరుగుబాటు తరువాత సైన్యం ఏర్పాటు చేసిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ది సేఫ్ గార్డింగ్ ఆఫ్ హోమ్ లాండ్ (సిఎన్ఎస్‌పి) భద్రతకు సంబంధించి 1997- 2020 మధ్య ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న అయిదు సహకార ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపాడు. నైజర్ అంతర్గత వ్యవహారాల్లో ఫ్రాన్స్ జోక్యానికి ప్రతిగా తాము ఈ చర్య తీసుకున్నట్టు సైనిక పాలకుడు చెప్పాడు. ఫ్రాన్స్, అమెరికా, నైజీరియా,టోగో దేశాలతో సంబంధాలు తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించాడు. సిఎన్ఎస్‌పి నైజర్‌లో ఫ్రాన్స్ రేడియో, ఫ్రాన్స్ ఇంటర్నేషనల్ అనే రెండు మీడియా సంస్థల కార్యకలాపాలను నిలిపివేస్తూ ఒక డిక్రీ జారీ చేశారు. ఈ రెండు మీడియా సంస్థలు ఫ్రెంచి ప్రభుత్వ యాజమాన్యం కింద పనిచేస్తున్నవే. అలాగే మరికొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థల కార్యకలాపాలను కూడా నిలిపివేయాలని నిర్ణయించాడు. అలాగే ఫ్రాన్స్‌లో తన రాయబార కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాడు.

గందరగోళం మధ్య బిల్లుల ఆమోదం సరికాదు : ఏచూరి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో : గందరగోళం మధ్య పార్లమెంట్‌లో కీలక బిల్లులను ఆమోదించడం సరికాదని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మణిపూర్ అంశంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జవాబుదారీ వహించకపోవడమే పార్లమెంట్ అంతరాయాలకు కారణమన్నారు. భారీ స్థాయిలో అడవి నిర్మూలించడం, అటవీ ప్రాంతాల్లో ప్రైవేట్ మైనింగ్‌కు అనుమతి ఇస్తూ తీసుకొచ్చిన అటవీ సంరక్షణ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించుకున్నారని, దీనికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో భారీ పోరాటాలు జరుగుతాయని చెప్పారు. అటవీ నిర్మూలన వాతావరణ మార్పులపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని, గతంలో ఎన్నడూ లేనంతంగా అకాల వరదలు, వర్షాలు, భూ కంపం, కొండచరియలు విరిగిపడటం, తీవ్రమైన వేడి వంటి వాతావరణ ప్రభావ చర్యలతో ప్రజలు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నియంత్రణలో ఉండే ఖనిజాలు మరీ ముఖ్యంగా లిథియం మైనింగ్‌ను ప్రైవేటీకరించే బిల్లును ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించడం దారుణమన్నారు.. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీకి అవసరమైన బ్యాటరీ ఉత్పత్తిలో కీలకమై లిథియంను కార్పొరేట్, బహుళ జాతి కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతుందని, ఇది దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. ఇలాంటి బిల్లులను ఆమోదించి, దేశ సంపదను దోచుకోవడానికి కార్పొరేట్లకు అనుమతి ఇస్తున్నారని విమర్శించారు.

రాహుల్ గాంధీపై అనర్హత ఎత్తివేయాలి

ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకునేందుకు మోడీ ప్రభుత్వం క్రిమినల్ పరువు నష్టం కేసుల మార్గాన్ని సరికొత్తగా ఎంచుకుందని ఏచూరి ధ్వజమెత్తారు. ఈడి, సిబిఐ తరువాత ఇప్పుడు ఇది మరొక కొత్త మార్గమని అయన అన్నారు. ఈ తరహా చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కోర్టు ఆదేశాలను చూపించి రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని ఆగమేఘాల మీద రద్దు చేశారని,దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు రాహుల్ గాంధీకి అనుకూలంగా తీర్పు ఇచ్చి రెండు రోజులు మూడు రోజులైనా ఆయన పార్లమెంట్ సభ్యత్వం పునరుద్ధరించకపోవడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు స్టే ఇవ్వడమే కాదు, కింది కోర్టుల విచారణ, పరిశీలనపైనా తీవ్రమైన వ్యాఖ్యలు చేసిందని అన్నారు.. గరిష్ఠ శిక్షకు గల కారణాలు తెలపకుండా కింది కోర్టు తీర్పు ఇచ్చిందని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొందన్నారు. రాహుల్ ఎంపీ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడంలో ఎంత దూకుడు ప్రదర్శించారో, అదే వేగంతో ఆయనపై అనర్హత వేటు ఎత్తివేయాలని ఆయన కోరారు.

హర్యానాలో బిజెపి బుల్డోజర్ రాజకీయాలు

హర్యానా బిజెపి ప్రభుత్వం అల్లర్ల అణచివేత పేరుతో మైనార్టీలను హింసించడం సరికాదన్నారు. వివక్షాపూరిత అరెస్టులు, బుల్డోజర్ రాజకీయలను కేంద్ర కమిటీ ఖండించిందని అన్నారు. చాలా మంది వద్ద ఆస్తి పత్రాలు ఉన్నప్పటికి, కూల్చివేతకు వ్యతిరేకంగా స్టే ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ కూల్చివేతలు యథాతథంగా కొనసాగుతున్నాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మతోన్మాద ఘర్షణలను రేపుతోందని ధ్వజమెత్తారు. సాధారణ పరిస్థితులు పునరుద్ధరించి, శాంతిని స్థాపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, కానీ మైనార్టీ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని, మతోన్మాద ధ్రువీకరణకు అవకాశం కల్పిస్తుందని విమర్శించారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం శాంతి భద్రతలను, మత సామరస్యతకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని, మతోన్మాద ఘర్షణలకు పాల్పడిన వారిని శిక్షించాలని అన్నారు. తప్పు ఎవరు చేశారో వారిపై చర్యలు తీసుకోవాలని, అంతేతప్ప ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని బుల్డోజర్ రాజకీయాలు చేయడాన్ని లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంలో అంగీకరించదగినది కాదని పేర్కొన్నారు.

అణ్వాయుధాలకు మద్దతు మూర్ఖత్వం

(మొదటి పేజీ తరువాయి)

ధర్మోపన్యాసం చేశారు. మే నెలలో హిరోషిమాలో జరిగిన జి-7 శిఖరాగ్ర సదస్సును రాజకీయ స్టంట్‌గా మార్చారని ఆయనపై ఇప్పటికే విమర్శలున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పంపిన సందేశాన్ని ఈ స్మారక కార్యక్రమంలో చదివి వినిపించారు. ఆగస్టు6, 1945న అమెరికా యుద్ధ విమానం నుంచి జారవిడిచిన అణుబాంబు హిరోషిమా నగరంపై పడి పేలిన కచ్చితమైన క్షణం అయిన ఉదయం.8.15 గంటలకు అందరూ లేచి ఒక్క క్షణం మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి 50 వేల మంది దాకా హాజరయ్యారు. హిరోషిమా, నాగసాకిపై అమెరికా జరిపిన అణుబాంబు దాడుల్లో ఆ సంవత్సరం చివరి నాటికి 1,40,000 మంది చనిపోయారు. ఇప్పటివరకు లెక్కవేస్తే మృతుల సంఖ్య 3,39,227కి చేరింది. వీరందరి పేర్ల జాబితాను సమాధి వద్ద ఉంచారు. అదే సమయంలో జపాన్ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలోను, అంతకు ముందు చైనా, కొరియాతో సహా అనేక ఆసియా దేశాలపై దురాక్రమణకు, దురాగతాలకు పాల్పడిన చరిత్ర దాచేస్తే దాగేది కాదని హిరోషిమా యూనివర్సిటీ ఎమిరేటస్ ప్రొఫెసర్ తోషియుకి తనకా పేర్కొన్నారు.



మీకోసం

ఆవపిండి పొడిపొడిగా రావాలంటే అందులో కొంచెం ఉప్పు వేసి మిక్సీ పట్టాలి.

జీవన సౌరభం

గెలుపు జ్ఞాపకాలను మిగులుస్తుంది.. ఓటమి అనుభవాలను నేర్పుతుంది.

అమ్మ ఎవరికైనా అమ్మ



ఆకుపచ్చ మర్రి మీద
గుబురాకుల కొమ్మలపై
ఎండు పుల్లలన్నీ తెచ్చి
గూడు కట్టే ఆడ కాకి.

పున్నమి రాకుండగనే
అరడజను గుడ్లు పెట్టె
లెక్కించెను మరునాడు
మరో గుడ్డు పెరిగె నచట.

మతిమరపును తిట్టుకుంటు
తనలో తను నవ్వుకుంది
గూడును వెచ్చగ చేసి
గుడ్లనేమో పొదిగింది.

ఎర్రని పిల్లల చూసి
సంతసించె తల్లికాకి
దగ్గరకు చేర్చుకుని
ముద్దు పెట్టి మురిసిపోయే.

ఎచటెచటో తిరిగి కాకి
తెస్తున్నది ఆహారం
ప్రతిపిల్లకు నోటికిచ్చి
చూపుతోంది మమకారం.

ఎదుగుతున్న పిల్లలన్ని
ఎగర నేర్చుకుంటున్నవి
అటూ ఇటూ జారి పడుతు
కాకి గోల చేస్తున్నవి

కావు కావు అనేచోట
కుహుకుహు మని వినిపించెను
ఆ కూతను విన్న కాకి
కోయిల అని గమనించెను.


గుడ్లను తను పొదగలేక
నా గూటిన విడిచింది
పుట్టిన తన పిల్లను కన
కోయిలమ్మ ఎగురుతోంది.

అది చూచిన కాకమ్మ
ఆ తల్లిని పిలిచింది.
కోయిలకు పిల్ల నిచ్చి
జాగ్రత్తలు చెప్పింది.

అమ్మంటే అంతే మరి
అవనిలోన ఎత్తైనది
ఎవరి పిల్లనైనా సరే
ఒకేలాగ సాకుతుంది!


- కూచిమంచి నాగేంద్ర
91821 27880

గజిబిజి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల పక్కన ఇచ్చిన గజిబిజి అక్షరాలను సరిగ్గా రాస్తే ఆ బొమ్మ పేరు వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ



గిద్దలూరు నందిని,
రాయదుర్గం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లల బొమ్మల్లో చరిత్ర చెబుతున్నాడు ...

ఇండియా, భూటాన్ సరిహద్దుల్లో ఉన్న బక్సా జిల్లాలో ఓ కుగ్రామంలో పుట్టిన కిరాత్, జానపద కథలు వింటూ పెరిగాడు. 'నేను విన్న ఆ కథల్లో ఆ ప్రాంత వీర మహిళలు, రైతులు, వృత్తిదారులు, జంతువులు, పక్షులు ఉన్నాయి. ఇప్పుడు పిల్లలకు ఆ కథలు ఎవరూ చెప్పడం లేదు. ఆన్‌లైన్లో దొరికే విషయాలకే పిల్లలు బానిసలైపోతున్నారు. అక్కడ చూసే బొమ్మలనే ఆటవస్తువులుగా మార్చుకుంటున్నారు. అది మన మూలాలను ఛిద్రం చేస్తుంది. క్రమేణా మన ప్రాంతానికే పరిమితమైన ఎన్నో చారిత్రక ఘట్టాలు కనుమరుగైపోతాయి. ఆ భావన రాగానే చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేశా'నని తన తొలి అడుగులు గురించి చెబుతున్న కిరాత్, 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి)లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. 'యానిమేషన్ డిజైనర్‌గా దేశవ్యాప్తంగా ఎంతోమందితో పనిచేశాను. నా పనిలో ఎప్పుడూ కొత్తదనం ఉండాలనుకునేవాడ్ని. అలా యానిమేషన్‌లో రకరకాల డిజైన్లు తయారుచేశాను. ఇంత చేస్తున్నా నా మనసు ఎప్పుడూ గ్రామం చుట్టూనే తిరుగుతూ ఉండేది.



పనిలో భాగంగా నేను దేశంలో చాలా ప్రాంతాలు తిరిగాను. అక్కడ ఎవరికీ నా ప్రాంతం మీద కనీస అవగాహన కూడా లేదు. అది నన్ను ఎంతో బాధించింది. 2020 లాక్‌డౌన్ పడినప్పుడు గ్రామానికి తిరిగివచ్చాను. ఆ విరామ సమయంలో వచ్చిన ఆలోచనే 'జంక్లా స్టూడియో' అంటూ తన ప్రాజెక్టుకు ప్రేరేపించిన సంగతులను వివరిస్తున్నాడు.



జానపద పాత్రలే నా బొమ్మలు

అస్సాం బోడా సంస్కృతిని రాబోయే తరాలకు పరిచయం చేయాలనుకున్న కిరాత్, పిల్లలు ఆడుకునే



పిల్లలు ఆడుకునేందుకు బొమ్మలు కొనిస్తాం.. కార్లు, స్కూటర్లు, ఆటోలు, విమానాలతో పాటు కాస్త ధర ఎక్కువైనా బార్బీ బొమ్మలు కూడా కొంటాం.. ఆ బొమ్మలతో పిల్లలు భలే సరదాగా ఆడుకుంటారు. ఆట మధ్యలో 'ఇదేంటి.. దీని పేరేంటి.. ఈ బొమ్మ ఎవరు తయారు చేస్తారు.. ఎక్కడి నుండి వచ్చింది..' అంటూ సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. 'అలా ప్రశ్నించడం.. పిల్లల సహజ లక్షణం. ఆ బొమ్మల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకునే క్రమంలో నా ప్రాంత సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా బొమ్మలు తయారుచేయాలనుకున్నాను' అంటూ యానిమేషన్ కెరియర్‌లో పదేళ్ల అనుభవాన్ని పక్కనబెట్టి అస్సాంలోని ఓ కుగ్రామానికి చేరుకున్నాడు 32 ఏళ్ల కిరాత్ బ్రహ్మ. పర్యావరణానికి హాని చేయని ఉత్పత్తులతో బొమ్మలు తయారుచేసేందుకు 'జంక్లా స్టూడియో'ను స్థాపించి స్థానికులను అందులో భాగస్వామ్యం చేశాడు. ఆ గ్రామస్తులు తయారుచేసిన బొమ్మలు అస్సాం ప్రజల వస్త్రధారణను, వారి అలంకరణలను, పూర్వీకుల చరిత్రను, ఆ ప్రాంతానికే పరిమితమైన రకరకాల పక్షులు, జంతువులను ప్రతిబింబిస్తూ తయారవుతున్నాయి.





బొమ్మల ద్వారా తన చరిత్రను ప్రచారం చేయాలనుకున్నాడు. అలా 2021లో చేతితో తయారు చేసే, ప్లాస్టిక్ రహిత, మృదువైన బొమ్మల తయారీపై దృష్టి పెట్టాడు. 'పిల్లలు ఆడుకునే బొమ్మలంటే మార్కెట్ అంతా స్పైడర్ మ్యాన్, మిక్కీ మౌస్, బార్బీ బొమ్మలతో నిండిపోయింది. ఆ మార్కెట్లో నా బొమ్మలకు కూడా స్థానం కల్పించాలనుకున్నాను. ఈ ప్రాంత గిరిజన సంస్కృతి, బోడో ప్రయాణికుడు, బోడో జ్యూహాలా, బోడో యుద్ధ వీరుడు, గౌదంగ్ రాణి, బోడో యువరాణి బొమ్మలు సాంప్రదాయ దుస్తులతో వాటి చరిత్రను చెబుతాయి. ఈ బొమ్మలు తయారుచేసేందుకు ఎంతో పరిశోధన చేశాను. జానపద కథల నుండి ఎంతో స్ఫూర్తి పొందాం' అంటూ తన బొమ్మల కథ చెబుతున్నాడు.

స్థానిక యువతకు ఉపాధి మార్గంగా..

అస్సాం ప్రాంతంలో ఎక్కువ మంది యువత ఉపాధి అవకాశాల కోసం సుదూరాలు ప్రయాణిస్తుంటారు. ఆర్మీలో కూడా చేరతారు. 'ఇప్పుడు నేను చేసిన ఈ ప్రయత్నంతో అటువంటి వారికి ఇక్కడే ఉపాధి దొరుకుతుంది. ఇప్పుడు మా బృందం తక్కువ ఉత్పత్తులే తయారుచేస్తూ ఉండొచ్చు. కాని భవిష్యత్తు కాలంలో ఆర్డర్లు పెరిగేలా కృషి చేస్తాను' అంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు కిరాత్.

ఆ ఆర్డర్ ఎంతో ఉత్సాహాన్నిచ్చింది..

కిరాత్ తయారుచేస్తున్న ఉత్పత్తుల గురించి తెలుసుకున్న ముంబయికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు ఆమె జన్మదినం సందర్భంగా కిరాత్‌కు పెద్ద ఆర్డరు ఇచ్చింది. 'నేను ఆమె ఉంటున్న చోటుకు ఓ మూల ఎక్కడో దేశ సరిహద్దుల్లో ఉన్నాను. కానీ ఆ ఆర్డరు వచ్చింది. అప్పుడు మా బృందం చాలా సంతోషించింది. ఇటువంటి ప్రోత్సాహం మమ్మల్ని ఇంకా ముందుకు తీసుకెళు_ంది' అంటూ సంతోషంగా చెబుతున్నాడు కిరాత్.

ఈ బట్టలేంటి ఇలా ఉన్నాయి..


'ఒకసారి నా మేనకోడలికి కిరాత్ బృందం తయారుచేసిన బొమ్మను బహుమతిగా ఇచ్చాను. ఆ బొమ్మను తీసుకుని పాప చాలా సంతోషించింది. 'ఈ బొమ్మ బట్టలేంటి ఇలా ఉన్నాయి.. ఇలాంటివి ఎక్కడ ధరిస్తారు' అంటూ ఆ చిన్న పాప అడిగినప్పుడు ఆర్డర్ తీసుకుంటున్నప్పుడు కిరాత్ నాతో అన్నమాటలు గుర్తుకొచ్చాయి. అతని లక్ష్యం నెరవేరుతుందని అనిపించింది కూడా..' అంటూ విభా కమత్ అనే కొనుగోలుదారు తన అనుభవాన్ని పంచుకున్నారు.





అక్కడ హీరోలు.. ఇక్కడ విలన్లు

బాలీవుడ్‌లో గతంలో ఓ వెలుగు వెలిగిన స్టార్ హీరోల్లో కొందరు విలన్లుగా మారుతున్నారు. గతంలో మంచి సక్సెస్ సాధించిన టైర్ 2 హీరోలు ఇప్పుడు క్యారెక్టర్ పాత్రలతో సరిపెట్టుకుంటూ మంచి బ్రేక్ కోసం చూస్తున్నారు. ఇలాంటి టైమ్‌లో వారు సెకండ్ ఇన్నింగ్స్‌గా టాలీవుడ్ స్టార్ హీరోల సినిమాల్లో విలన్‌గా నటించే అవకాశాలను అందుకుంటున్నారు. చిరంజీవి, బాలకృష్ణ, ప్రభాస్, పవన్ తదితర హీరోలు నటిస్తున్న చిత్రాల్లో వీరే కన్పిస్తుండటం కొసమెరుపు. భారతదేశస్థాయిలో (పాన్ ఇండియా) సినిమాల దశకం ఆరంభమైన తర్వాత తెలుగు పరిశ్రమల్లో ప్రధాన హీరోల సినిమాలకు మరింత ఆదరణ పెరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని హీరోలు తమ సినిమాలు పాన్‌ఇండియా స్థాయిలో ఆడాలంటే బాలీవుడ్‌లో ప్రముఖ హీరోలను ఆయా సినిమాల్లో ఏదోఒక పాత్రల్లో పోషింపచేయటం ప్రారంభమైంది. ఇలా మొదలైన పాన్ ఇండియా చిత్రాలు నేడు దేశంలోని చాలా చిత్ర పరిశ్రమల్లో తీయబడుతున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమకు వివిధ రూపాల్లో అందుతున్న సదుపాయాలు, మౌలిక వసతుల రీత్యా టాలీవుడ్ వైపు బాలీవుడ్ నటుల చూపు పడింది. నేరుగా తెలుగులో తీస్తున్న సినిమాల్లో సైతం బాలీవుడ్ నటులు పనిచేస్తున్నారు.









సైఫ్ అలీఖాన్ : ఒకప్పుడు స్టార్ హీరోగా వెలిగారు. ప్రస్తుతం అతడిది అంత రేంజ్ కాకపోయినా స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ తన కెరీర్‌ను లీడ్ చేస్తున్నారు. ప్రభాస్ 'ఆదిపురుష్' మూవీలో రావణాసురుడి పాత్రలో నటించారు. ఎన్టీఆర్, కొరటాల శివ మూవీలో విలన్‌గా మరో ఆఫర్ అందుకున్నారు.

బాబీ డియోల్ : పవన్ కళ్యాణ్, క్రిష్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న 'హరిహర వీరమల్లు' మొఘలాయిల పాలన బ్యాక్ డ్రాప్‌లో ఫిక్షనల్ స్టోరీతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో పవన్ గజదొంగ వీరమల్లు అనే మల్లయోధుడిగా నటిస్తున్నారు. పవన్‌కు సరైన పోటీనిచ్చేందుకు బాలీవుడ్ నటుడు బాబీడియోల్‌ను రంగంలోకి దింపారు. ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ నటిస్తున్నాడు. వీరమల్లుకు, ఔరంగజేబుకు మధ్య యాక్షన్ ఎపిసోడ్స్ చాలా ఉన్నాయని చిత్రవర్గాల నుంచి సమాచారం.

అర్జున్ రాంపాల్ : బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లోని మూవీ ప్రస్తుతం సెట్స్ పై ఉంది. బాలయ్యకు 108వ సినిమా ఇది. కాజల్ అగర్వాల్ హీరోయిన్ కాగా శ్రీలీల కీలకపాత్రలో నటిస్తోంది. వెరైటీ కథతో, డిఫరెంట్ స్టోరీతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు అనిల్. ఈ సినిమాలో బాలయ్య ను ఢీకొట్టే పవర్ ఫుల్ విలన్‌గా బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్‌ను ఫిక్స్ చేసినట్టు టాక్.

సంజయ్‌దత్ : హీరో ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లోని సినిమా ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. దీనికి 'రాజా డీలక్స్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఒక థియేటర్ బ్యాక్ డ్రాప్‌లోని కామెడీ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. అయితే ఈ మూవీకి విలన్ లాంటి ప్రభాస్ తాత పాత్ర కోసం బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్‌ను ఫిక్స్ చేసినట్టు వార్తలొస్తున్నాయి. త్వరలోనే సంజయ్‌దత్‌ను అఫీషియల్‌గా ప్రకటించబోతున్నారు.

పవర్ 'దంగల్'

- అధ్యక్ష బరిలో బ్రిజ్‌భూషణ్ అనుచరుడు సంజయ్ సింగ్
- రెజ్లింగ్ కుటుంబం మద్దతుతో అనిత షియోరాన్
- భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు





న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అంతిమ దంగల్‌కు సిద్ధమవుతోంది. బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అనుచరుడు సంజయ్ సింగ్, మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో కీలక సాక్షి, కామన్‌వెల్త్ క్రీడల మాజీ చాంపియన్ అనిత షియోరాన్‌లు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష పదవి రేసులో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఆగస్టు 12న డబ్ల్యూఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నికలు జరుగనుండగా.. శనివారంతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జమ్మూ కాశ్మీర్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి మహేశ్ మిట్టల్ కుమార్ సోమవారం ఎన్నికల్లో పోటీపడనున్న అభ్యర్థుల జాబితాను అధికారికంగా వెల్లడించనున్నారు.

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, అతడి కుటుంబ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయకుండా కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ నిలువరించింది. కానీ రెజ్లింగ్ సమాఖ్యలో తిరుగులేని పట్టు సాధించిన బ్రిజ్ భూషణ్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో 15 స్థానాలకు తన అనుచరులను బరిలో నిలిపాడు. ఎగ్జిక్యూటివ్ కమిటీలో ఏకగ్రీవ అభ్యర్థులను ఖరారు చేస్తారనే ఊహాగానాలు వినిపించినా.. గత వారం రాష్ట్ర సంఘాలతో సమావేశమైన బ్రిజ్‌భూషణ్ సింగ్ ఎన్నికల బరిలో నిలిచేందుకే మొగ్గు చూపాడు. ఇక బ్రిజ్‌భూషణ్ హయాంలో సంయుక్త కార్యదర్శిగా పని చేసిన సంజయ్ సింగ్‌ను బ్రిజ్ భూషణ్ స్వయంగా అధ్యక్ష పదవి పోటీకి ఎంపిక చేశారు. మరోవైపు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగిన వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా సహ రెజ్లింగ్ కుటుంబం మద్దతుతో అనిత షియోరాన్ బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియటంతో అధ్యక్ష బరిలో సంజయ్ సింగ్, అనిత షియోరాన్‌లు మాత్రమే మిగిలారు.

ఏకపక్షమే..! : బ్రిజ్‌భూషణ్, అతడి కుటుంబ సభ్యులను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిలువరించినా.. భారత రెజ్లింగ్ సమాఖ్య మరో నాలుగేండ్లు బిజెపి ఎంపీ కనుసన్నల్లోనే నడవనుంది. డబ్ల్యూఎఫ్ఐలో 25 అనుబంధ సంఘాలు ఉండగా.. ఎన్నికల ప్రక్రియలో 24 రాష్ట్ర సంఘాలు ఓటు హక్కు వినియోగించుకోనున్నాయి. ప్రతి రాష్ట్ర సంఘం నుంచి ఇద్దరికి ఓటు హక్కు ఉంటుంది. ఓటు వేయనున్న 24 రాష్ట్ర రెజ్లింగ్ సంఘాల్లో ఏకంగా 20 సంఘాలు బ్రిజ్‌భూషణ్‌కు బహిరంగంగా మద్దతు పలుకుతున్నాయి. దీంతో అధ్యక్షుడు సహ 15 మందితో కూడిన ఎగ్జిక్యూటివ్ ప్యానల్‌కు బ్రిజ్ భూషణ్ అనుచరులే ఎన్నిక కానున్నారు!. ప్రధాన కార్యదర్శి పదవికి రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్ఎస్‌పీబీ) కార్యదర్శి ప్రేమ్ చంద్‌తో బ్రిజ్‌భూషణ్ అనుచరుడు దర్శన్ లాల్ పోటీపడనున్నాడు. ఉత్తరాఖండ్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి, బ్రిజ్‌భూషణ్ అత్యంత సన్నిహితుడు సత్యపాల్ సింగ్ దేశ్వాల్ కోశాధికారి పదవికి పోటీపడుతున్నాడు. ఇతడికి వెటరన్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్ దుశ్యంత్ శర్మ నుంచి పోటీ ఉంది. ఉపాధ్యక్ష పదవి రేసులో ఐడి నానావతి (గుజరాత్), దేవేంద్ర కడియన్ (హర్యానా) నిలిచారు.

రన్నరప్ ప్రణయ్

ఫైనల్లో పోరాడి ఓడిన కేరళ స్టార్
ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్



సిడ్నీ (ఆస్ట్రేలియా) : భారత వెటరన్ షట్లర్, వరల్డ్ నం.9 హెచ్. ఎస్ ప్రణయ్ సీజన్లో రెండో టైటిల్ వేటలో తడబాటుకు గురయ్యాడు. మలేషియా మాస్టర్స్ టోర్నీ పతక పోరులో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్‌ను ఓడించి.. ఆరేండ్ల డబ్ల్యూబిఎఫ్ టైటిల్ దాహం తీర్చుకున్న హెచ్.ఎస్ ప్రణయ్.. తాజాగా అదే ప్రత్యర్థి చేతిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 ఫైనల్లో పరాజయం పాలయ్యాడు. 90 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో 9-21, 23-21, 20-22తో హెచ్.ఎస్ ప్రణయ్ టైటిల్ చేజార్చుకున్నాడు. వరల్డ్ నం.24 వెంగ్ హాంగ్ యాంగ్‌తో ఫైనల్లో ఫేవరేట్‌గా బరిలోకి దిగిన ప్రణయ్.. తొలి గేమ్‌లో పూర్తిగా తేలిపోయాడు. కానీ క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నం.2, టాప్ సీడ్ ఆంటోని గింటింగ్‌పై సహా పలు కీలక మ్యాచుల్లో ప్రణయ్ తొలి గేమ్‌లో తడబాటుకు లోనైనా.. ఆ తర్వాత అద్వితీయ ప్రదర్శనతో పుంజుకున్నాడు. అదే ఫార్ములా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోనూ అనుసరిస్తునాడని అనిపించింది. నిర్ణయాత్మక గేమ్‌లోనూ ప్రణయ్ గెలుపు గీతకు చేరువగా నిలిచినా.. ఆఖర్లో ఊహించని రీతిలో కేరళ స్టార్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మహిళల సింగిల్స్‌లో బీవెన్ జాంగ్ (అమెరికా), మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫెంగ్ యాన్ జె, డాంగ్ పింగ్ (చైనా)..మెన్స్ డబుల్స్‌లో మిన్, జే (దక్షిణ కొరియా), మహిళల డబుల్స్‌లో కిమ్, కాంగ్ (దక్షిణ కొరియా) చాంపియన్లుగా నిలిచారు. మెన్స్ సింగిల్స్ ఫైనల్లో ప్రణయ్ పోరాడి ఓడాడు. తొలి గేమ్‌ను 9-21తో చెత్తగా కోల్పోయినా.. రెండో గేమ్‌లో గట్టిగా పుంజుకున్నాడు. టైబ్రేకర్‌లో 23-21తో రెండో గేమ్‌ను గెల్చుకున్నాడు. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. ఇక డిసైడర్‌లో ప్రణయ్ ప్రతాపం చూపించాడు. మలేషియా మాస్టర్స్ ఫలితం పునరావృతం అవుతున్నట్టే అనిపించింది. 19-14తో ఐదు పాయింట్ల ఆధిక్యంలో నిలిచిన ప్రణయ్ టైటిల్‌కు మరో రెండు పాయింట్లు దూరంలో నిలిచాడు. ఇక్కడే వెంగ్ హాంగ్ యాంగ్ మ్యాజిక్ షో చేశాడు. వరుసగా పాయింట్లు కొల్లగొట్టిన చైనా షట్లర్.. ప్రణయ్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చాడు. ఐదు పాయింట్ల అంతరం చెరిపేసిన వెంగ్ హాంగ్ యాంగ్.. ప్రణయ్‌ను మ్యాచ్ పాయింట్ వద్ద నిలువరించి మరీ టైటిల్ కొట్టాడు. టైబ్రేకర్‌లో 22-20తో మూడో గేమ్‌ను వెంగ్ సొంతం చేసుకున్నాడు. దీంతో హెచ్.ఎస్ ప్రణయ్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68